


# విజయభాను




విశాఖపట్నం, శుక్రవారం 02-11-2018 | VIJAYABHANU DAILY VISAKHAPATNAM EDITION | సంపుటి : 42 సంచిక : 46 పేజీలు : 8 వెల : 1 రూపాయి


## భారత్‌పై అమెరికా మరో దెబ్బ

### దాదాపు 50 వస్తువులపై రాయితీ ఎత్తివేత



వాషింగ్టన్: భారత్-అమెరికా మధ్య నెలకొన్న వాణిజ్య సమస్యలపై అగ్రరాజ్యం తన వైఖరిని ఏ మాత్రం మార్చుకునేందుకు సిద్ధంగా లేదనేది మరోసారి స్పష్టమైంది. తాజాగా అమెరికా దిగుమతి చేసుకునే 90 వస్తువులపై సుంకం రాయితీలను ఎత్తివేసింది. వీటిలో 50 వస్తువులు భారత్ నుంచి దిగుమతి చేసుకునేవే కావడం గమనార్హం. జనరలైజ్డ్ సిస్టమ్ ఆఫ్ ప్రిఫరెన్సెస్(జీఎస్‌పీ) కింద అమెరికా కొన్ని దిగుమతి చేసుకునే వస్తువులపై సుంకాల్లో పూర్తి రాయితీ కల్పిస్తుంది. అయితే తాజాగా ఈ జాబితా నుంచి 90 వస్తువులను తీసేస్తున్నట్లు ఫెడరల్ రిజిస్టర్ ఓ నోటిఫికేషన్ జారీ చేసింది. నవంబరు 1 నుంచి 90 వస్తువులపై సుంక రహిత రాయితీని ఎత్తివేస్తున్నట్లు గత మంగళవారం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఓ ప్రకటనలో తెలిపారు. నవంబరు 1 నుంచి ఈ వస్తువులు జీఎస్‌పీ కిందకు రావు అని అమెరికా వాణిజ్య ప్రతినిధి ఒకరు మీడియాకు వెల్లడించారు. కాగా.. దేశాలను పరిగణనలోకి తీసుకుని ఈ వస్తువులను ఎంపిక చేయలేదని, ఆయా వస్తువుల ప్రాధాన్యం ప్రకారమే నిర్ణయించామని ఆ ప్రతినిధి తెలిపారు.

**భారత్‌పైనే ఎక్కువ ప్రభావం..**

కాగా.. అమెరికా జీఎస్‌పీ వల్ల ఎక్కువగా లాభపడుతున్న దేశాల్లో భారత్ ప్రథమ తరువాయి 2లో..

## జనసేనాని రైలు యాత్ర

అమరావతి: జనసేన అధినేత పవన్ కల్యాణ్ శుక్రవారం (నవంబర్2న) రైలు యాత్ర చేయనున్నారు. విజయవాడ నుంచి తుని వరకు ఆయన జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌లో జనంతో కలిసి రైల్లో ప్రయాణించనున్నారు. ఈ విషయాన్ని జనసేన పార్టీ స్వయంగా ట్విట్టర్ ద్వారా వెల్లడించింది. ఈ జర్నీకి సంబంధించిన పోస్టర్ కూడా విడుదల చేసింది. శుక్రవారం మధ్యాహ్నం 1.20 నిమిషాలకు విజయవాడలో పవన్ జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌లో బయల్దేరతారు. సాయంత్రం 5.20 నిమిషాలకు తుని రైల్వే స్టేషన్‌లో దిగుతారు. ఈ ప్రయాణంలో ప్రజా సమస్యలు, జనసేన పార్టీ ఆశయాలకు ప్రయాణికులకు వివరిస్తారు.

పవన్ రైలు యాత్ర నేపథ్యంలో అభిమానులు, కార్యకర్తలకు జనసేన పార్టీ పలు తరువాయి 2లో..




### దేశాన్ని కాపాడదాం.. ప్రజాస్వామ్యాన్ని

# పరిరక్షిద్దాం

- అందుకే రాహుల్‌ని కలిశా
- విభజన సమస్యల పరిష్కారానికి మద్దతిచ్చారు
- అన్ని రాజకీయ పార్టీలను ఏకతాటిపైకి తీసుకొస్తా
- భేటీ అనంతరం మీడియాతో మాట్లాడిన చంద్రబాబు



దిల్లీ: కేంద్ర ప్రభుత్వం అన్ని వ్యవస్థలనూ భ్రష్టు పట్టించిందని.. ఇలాంటి పరిస్థితుల్లో దేశ ప్రజాస్వామ్యాన్ని కాపాడటం కోసమే కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీని కలిశానని సీఎం చంద్రబాబు నాయుడు వెల్లడించారు. రాహుల్‌తో చర్చలు జరిపిన చంద్రబాబు.. దేశాన్ని ఎలా కాపాడుకోవాలన్న అంశంపైనే చర్చించినట్టు వివరించారు. దిల్లీలో రాహుల్ నివాసంలో భేటీ అనంతరం ఇద్దరు నేతలు సంయుక్తంగా మీడియాతో మాట్లాడారు.

దేశాన్ని కాపాడదాం.. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షిద్దాం అనే నినాదంతో ఇరు పార్టీలు కలిసి పనిచేస్తాయని చంద్రబాబు స్పష్టంచేశారు. విభజన సమస్యల పరిష్కారానికి కూడా రాహుల్ మద్దతిచ్చారని, ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాలని కోరగా.. అందుకు ఆయన అంగీకరించారని వెల్లడించారు. రఫేల్ పోరాటాన్ని రాహుల్ ప్రజల్లోకి బాగా తీసుకెళ్లారని ప్రశంసించారు. భాజపాకు వ్యతిరేకంగా అన్ని రాజకీయ పార్టీలను ఏకతాటిపైకి తీసుకొచ్చి భవిష్యత్తు ప్రణాళికను సిద్ధం చేస్తామని తెలిపారు.

ఆర్బీఐ, సీబీఐ, ఈడీ, ఐటీ, గవర్నర్ల వ్యవస్థ.. ఇలా అన్ని వ్యవస్థలూ సంక్షోభంలో కూరుకుపోతున్నాయని చంద్రబాబు ఆందోళన వ్యక్తంచేశారు. అన్ని రాజకీయ పార్టీలతో చర్చించి ఒక ఉమ్మడి సమావేశం ఏర్పాటు చేసి భవిష్యత్తు కార్యాచరణను రూపొందిస్తామన్నారు.

**భాజపాను ఓడించి..**
**ప్రజాస్వామ్యాన్ని కాపాడతాం**
**పాత విషయాల జోలికి వెళ్లం.. రాహుల్**

వచ్చే ఎన్నికల్లో భాజపాను ఓడించి.. ప్రజాస్వామ్యాన్ని, ప్రభుత్వ వ్యవస్థలను కాపాడమే లక్ష్యంగా తమ భేటీ మంచి వాతావరణంలో సాగిందని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ వెల్లడించారు. భాజపాను ఓడించడమే లక్ష్యంగా తమ పార్టీలు కలిసి పనిచేస్తాయని తెలిపారు.

దేశాన్ని కాపాడుకునేందుకు భాజపా వ్యతిరేక పార్టీలన్నింటినీ ఏకం చేసి ఒకే వేదికపైకి తీసుకొస్తామని చెప్పారు. గతంలో తమ పార్టీల మధ్య వైరుధ్యాలు ఉన్న మాట వాస్తవమే అయినప్పటికీ.. ప్రస్తుతం దేశంలో నెలకొన్న పరిస్థితులపైనే చర్చించినట్టు రాహుల్ తెలిపారు. తాము పాత విషయాల జోలికి పోవడంలేదన్నారు. ప్రస్తుత, భవిష్యత్తులో జరగబోయే అంశాలపైనే దృష్టి పెడుతున్నట్టు చెప్పారు. దేశంలో నెలకొన్న రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో ఎలా ముందుకు వెళ్లాలో చంద్రబాబుతో భేటీలో చర్చించినట్టు చెప్పారు. భాజపా అన్ని వ్యవస్థలపైనా దాడి చేస్తోందని తరువాయి 2లో..

## అగ్రిగోల్డ్ బాధితుల అరెస్ట్

### 30 గంటలపాటు బాధితుల ధర్మాగ్రహ దీక్ష



వార్త 2వ పేజీలో..

### భారత్ తెలిపిన అభ్యంతరాలపై

## చైనా స్పందన

### చైనా వైఖరి స్పష్టంగానే ఉంది



న్యూదిల్లీ: పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే) మీదుగా బస్సు సేవలు ప్రారంభించేందుకు పాక్, చైనాలు సిద్ధమవడంపై భారత్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. భారత్ తెలిపిన అభ్యంతరాలపై చైనా స్పందించి, తమ చర్యను సమర్థించుకునే ప్రయత్నం చేసింది. భూభాగాల పరంగా పాకిస్థాన్-భారత్‌కు మధ్య ఉన్న విభేదాలను ఏ విధంగానూ ప్రభావితం చేయకుండా తాము పాక్‌తో సత్సంబంధాలు కొనసాగిస్తామని చెప్పింది. అలాగే, కశ్మీర్‌పై తమ వైఖరి మారబోదని తెలిపింది. ఈ విషయంపై చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధులు కాంగ్ మీడియాతో మాట్లాడుతూ... భారత్ దౌత్య పరంగా నిరసన తెలుపుతోందని నాకు తెలియదు. కానీ, కశ్మీర్ వివాదంలో మాత్రం చైనా వైఖరి స్పష్టంగానే ఉంది. చాలా సార్లు దీనిపై స్పష్టంగా మా విధానం గురించి తెలిపాం. చైనా, పాక్‌కు మధ్య ఉన్న సత్సంబంధాలు.. భూభాగాల పరంగా తరువాయి 2లో..

## కర్ణాటక ఉపఎన్నికలు బిజెపికి షాక్

బెంగళూరు: కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో ఎక్కువ సీట్లు సాధించి అతిపెద్ద పార్టీగా అవతరించినప్పటికీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేకపోయిన భారతీయ జనతా పార్టీకి ఇప్పుడు ఉప ఎన్నికల్లో మరో ఎదురుదెబ్బ తగిలింది. రామనగర అసెంబ్లీ ఉప ఎన్నికకు భాజపా తరఫున బరిలోకి దిగిన అభ్యర్థి ఎల్.చంద్రశేఖర్ అనూహ్యంగా చివరి నిమిషంలో పోటీ నుంచి తప్పుకున్నారు. అంతేగాక పార్టీ కూడా మారారు. తాను తిరిగి కాంగ్రెస్ పార్టీలోకి వస్తున్నట్లు గురువారం ప్రకటించారు.

కర్ణాటక ముఖ్యమంత్రి కుమారస్వామి అసెంబ్లీ ఎన్నికల్లో రామనగర, చెన్నపట్న నియోజకవర్గాల నుంచి గెలుపొందారు. అయితే ఫలితాల తర్వాత ఆయన రామనగర స్థానానికి రాజీనామా చేశారు. దీంతో అక్కడ ఉప ఎన్నిక అనివార్యమైంది. ఈ ఉప ఎన్నికలో జేడీఎస్ పార్టీ నుంచి సీఎం కుమారుస్వామి సతీమణి అనిత కుమారస్వామి బరిలోకి దిగారు. ఇక సంకీర్ణ ప్రభుత్వంలో





జేడీఎస్‌కు మద్దతుగా ఉన్న కాంగ్రెస్ ఈ ఎన్నికలకు దూరంగా ఉంది. అనితకు వ్యతిరేకంగా భాజపా చంద్రశేఖర్‌ను బరిలో నిలిపింది.

అయితే కాంగ్రెస్ నేత అయిన చంద్రశేఖర్ ఇటీవలే భాజపాలో చేరారు. తరువాయి 2లో..






## ప్రజల ఓట్లే గెలిపించేది



దిల్లీ: రాముడు, అల్లా కాదు.. ప్రజల ఓట్లే ఎన్నికల్లో గెలుపొందేలా చేస్తాయని నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా అన్నారు. గురువారం దిల్లీలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిని కలిసిన తర్వాత ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా తరువాయి 2లో..




# నేడు అనకాపల్లికి మంత్రి కాలువ శ్రీనివాసు రాక



అనకాపల్లి : రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి కాలువ శ్రీనివాసులు శుక్రవారం అనకా పల్లి విచ్చేస్తున్నారు. మండ లంలో మారేడుపూడి గ్రామంలో నిర్మించిన గృహ సముదాయం లబ్దిదారు లకు అందజేసేందుకు వస్తున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు తెలిపాయి. హుదుద్ తుఫాన్‌లో నష్టపోయిన బాధితులను గుర్తించి వారికి గృహనిర్మాణాలు చేపట్టడం జరిగింది. ఎట్టకేలకు మంత్రి చేతులుమీదుగా ఉదయం జరిగే కార్యక్రమంలో వీటిని లబ్దిదారు లకు అందజేయనున్నారు.

## త్రాగునీటి ఇబ్బందుల పరిష్కారానికి చర్యలు

### మున్సిపల్ డిఇ వంశీ

విజయనగరం : పట్టణ ప్రజల త్రాగునీటి ఇబ్బందులు పరిష్క రించడానికి ప్రత్యామ్నాయ మార్గాలు ద్వారా చర్యలు తీసుకుం టున్నామని మున్సిపల్ డిఇ వంశీ ఒక ప్రకటనలో తెలియజేశారు. ఇంటర్‌కనెక్షన్ ద్వారా కొత్త అగ్రహారం వాటర్ ట్యాంకు పరిధిలో గల తొమ్మిది వార్డులకు గురువారం కొళాయిలు ద్వారా మంచినీటిని సరఫరా చేసామన్నారు. అలాగే వి.టి.అగ్రహారం, వుడా కాలనీ పైలెట్ ప్రాజెక్టులు వద్ద ఒకటి, రెండురోజుల్లో కొత్తగా వేసిన బోర్లుకు మోటార్లు బిగించి పంపింగ్‌ను ప్రారంభిస్తామన్నారు. అక్కడ ఉన్న ట్యాంకులు ద్వారా ఆ ప్రాంతాల్లో కొళాయిలు ద్వారా నీటిని సరఫరా చేస్తామన్నారు. అలాగే కొత్త అగ్రహారం నుండి బూస్టర్స్ ద్వారా బాలాజీనగర్ ట్యాంకునకు నీటిని తరలించే పనులను ప్రారంభించామన్నారు. శనివారం నాటికి బాలాజీనగర్ ట్యాంకు ద్వారా ఆయా వార్డులకు నీటిని సరఫరా చేయడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. అలాగే కొళాయిలు ద్వారా మంచినీరు సరఫరా కాని వార్డులకు నీటి సరఫరా కొరకు 15 ట్యాంకర్లను ఏర్పాటు చేసామన్నారు. ట్యాంకర్ల ద్వారా ప్రణాళికా బద్దంగా నీటిని సరఫరా చేస్తున్నామన్నారు. ఈ కష్టకాలంలో ప్రజలందరూ సహకరించి, నీటిని పొదుపుగా వాడుకోవాలని విజ్ఞప్తి చేశారు. అలాగే మోటార్లు ద్వారా నీటిచౌర్యానికి పాల్పడితే చర్యలు తీసుకుంటామని తెలియజేశారు.

## భీమిలిలో గ్రామదర్శిని



భీమునిపట్నం : భీమిలి డివిజన్ 24వ వార్డు యాతకుమ్మరి పాలెం లో జరిగిన గ్రామదర్శిని కార్యక్రమం భీమిలి జోనల్ కమి షనర్ పి.దుర్గాప్రసాద్ అధ్యక్షతన నిర్వహించారు. భీమిలి డివిజన్ టీడీపీ అధ్యక్షులు గంటా.నూకరాజు మాట్లాడుతూ భీమిలి నియోజకవర్గ పరిధిలో రెండు వేల నాలుగు వందల కోట్ల రూపాయలు తో అభివృద్ధి పనులు జరిగాయని తెలిపారు సామాజిక భవనాలు, సి సి రోడ్లు, కాలువలు,రెండు కోట్ల 72 లక్షల 86వేల రూపాయలు తో అభివృద్ధి పనులు చేసినట్లు తెలిపారు. అలాగే చంద్రన్న బీమా, పెళ్లికానుక, 50 సంవత్సరం లకే మత్య కారులకు పింఛన్లు,ఒంటరి మహిళ, నిరోద్యోగ భృతి వంటివి ప్రజా ధారణ పొందాయని చెప్పారు. ఏమైనా సమస్యలు ఉంటే తెల పాలని ఆయన కోరారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో జోనల్ కార్యాలయం సిబ్బంది సుధాకర్, టి.పి.ఆర్ ఓ శ్రీనివాస్, సి.ఓ. రమణ, టి.డి.పి.నాయ కులు గిడుతూరి శ్రీనివాసరావు, కాసరపు నాగరాజు, ఊళ్ళ దుర్గారావు, వియ్యపు పోతురాజు,రఘు,సురేష్ గూడుపు రాజు జన్మభూమి కమిటీ సభ్యులు, సంకల్ప మిత్ర అనిత పాల్గొన్నారు.

# అర్హులైన వారందరికీ ఫించన్లు ఇచ్చిన ఘనత టీడీపీదే



అనకాపల్లి : అర్హులైన వారందరికి ఫించన్లు పంపిణీ చేసిన ఘనత తెలుగుదేశంపార్టీకే దక్కుతుందని, అనకాపల్లి శాసన సభ్యులు పీలా గోవిందసత్యనారాయణ అన్నారు. పట్టణంలోని విజయరామరాజుపేట, లక్ష్మీదేవిపేట, గవరపాలెం ఉద్యాన సమితి వద్ద జరిగిన ఫించన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన గురువారం ముఖ్య అతిధిగా పాల్గొని ప్రసంగించారు. రాష్ట్ర ప్రభు త్వం పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందన్నారు. అందులో భాగంగా ప్రతీ పేదవాడికి అర్హతను బట్టి సంక్షేమ పథకాలు అందజేయడం జరుగుతుందన్నారు. ఇప్పటికైనా ఎవరికైనా ఫించను అందకపోతే, తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. అనంతరం హాజరైన వారందరికి ఫించన్లను అందజేసారు. ఈ కార్య క్రమంలో జీవీఎంసీ అధికారులు, తెలుగుదేశం పార్టీ అర్బన్ జిల్లా ఉపాధ్యక్షులు, మళ్ల సురేంద్ర, మళ్ల సత్యనారాయణ, కాండ్రేగుల రాజు, గొర్లి శేఖర్ కొణతాల వెంకటరావు, గోల్డ్ వాసు, స్దానిక నేతలు తదితరులు పాల్గొన్నారు.

## ఎఫ్.సి.ఐ గోడౌన్లో ఫుడ్ & విజిలెన్స్ తనిఖీలు



పిఠాపురం : పిఠాపురం స్థానిక బై పాస్ రోడ్డుని ఆనుకొనివున్న ఎఫ్.సి.ఐ గోడౌన్లలో స్టేట్ లెవెల్ కన్సల్టెటివ్ కమిటీ మెంబర్ అండ్ ఫుడ్ & విజిలెన్సు అధికారి అబ్బి రెడ్డి ప్రభాకరరెడ్డి ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. బియ్యం, పంచదార, కందిపప్పు నిల్వలు వాటి తూకాలు మరియు సరఫరా ఇప్పటివరకూ ఎం.ఎల్.ఎస్ పాయింట్లు నుంచి ఎంతవరకూ పంపిణీ చేశారనేటటు వంటి విషయములో తనిఖీలు నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల ప్రారంభంలో గోడౌన్ల నుండి డీలర్ల దుకాణాలుకి సరఫరా విషయములో నెల వారి సాధారణ తనిఖీలు నిర్వహించామని, అదే విధంగా అన్ని రేషన్ దుకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తామని ప్రజలకు అందవలసిన సరుకుల విషయంలో ఎటువంటి అవకతవకలు జరిగినా గుర్తించి తదుపరి చర్యలకై సంబందిత అధికారు లకు ఆదేశాలి స్తామని తెలిపారు.

# భావకవితా కల్పవల్లి దేవులపల్లి

### జిల్లా భాషా సాంస్కృతిక శాఖాధికారి లక్ష్మీనారాయణ



విజయనగరం: దేవులపల్లి కృష్ణశాస్త్రి భావ కవితా కల్పవల్లి అని జిల్లా భాషా సాంస్క ృతిక శాఖాధికారి పి.ఎన్.వి లక్ష్మీ నారాయణ అన్నారు. దేవుల పల్లి జయంతిని పురస్కరించు కుని తెలుగు భాషా పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో శారదా విద్యాపీఠ్‌లో ఏర్పాటు చేసిన కార్య క్రమంలో ఆయన మాట్లాడుతూ దేవుపల్లి రసాత్మ కమైన, కవితాత్మకమైన, సృజ నాత్మకమైన రచనలు చేశారని అన్నారు. ప్రధాన వక్తగా పాల్గొన్న ప్రముఖ రచయిత, సాహితీవేత్త, గురజాడ స్మారక పురస్కార గ్రహీత డాక్టర్ భైరవభట్ల ఆదిత్య మాట్లాడుతూ కాళిదాసు, భవభూతి, తిక్కన, సూరదాసు, రామదాసు, అన్న మయ్య, క్షేత్రయ్య వంటి ప్రముఖులను ఒక్కటి చేస్తే ఆ మహనీయుడే కృష్ణ శాస్త్రి అని అభివర్ణించారు.

తెలుగింటి సాంప్రదాయకమైన ఆడపిల్ల ఎలా ఉంటుందంటే కృష్ణశాస్త్రి కవితలా ఉంటుందని చెప్పవచ్చునని, తాను రాసిన కవితలకు కావ్య గౌరవాన్ని సాధించిన మహ నీయుడు కృష్ణశాస్త్రి అని అన్నారు. అనం తరం సమితి అధ్యక్ష కార్యదర్శులు సముద్రాల గురుప్రసాద్, డాక్టర్ జక్కు రామకృష్ణలు కలసి డాక్టర్ ఆదిత్యను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సమితి ఉపాధ్యక్షులు పిన్నింటి సూర్య నారా యణ, సలహాదారు ఎం.సుభద్రాదేవి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.వి.శ్రీనివాస్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి

## దేశాన్ని కాపాడదాం.. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షిద్దాం

రాహుల్ ఆందోళన వ్యక్తంచేశారు. రాజ్యాంగ వ్యవస్థలపై జరుగుతున్న దాడిని ఆపడమే తమ లక్ష్యమన్నారు. ఉమ్మడి కార్యాచరణను ముందుకు తీసుకెళ్తామని చెప్పారు. నిరుద్యోగం, రైతు సమస్యలు, భాజపా కుంభకోణాలపై ఉద్యమిస్తామని రాహుల్ వివరించారు.

## భారత్‌పై అమెరికా మరో దెబ్బ

స్థానంలో ఉంది. ట్రంప్ తాజా నిర్ణయం భారత్‌పై తీవ్ర ప్రభావం చూపే అవకాశాలున్నాయి. రాయితీ ఎత్తివేసిన 90 వస్తువుల్లో దాదాపు 50 వస్తువులు భారత్ నుంచి దిగుమతి చేసుకునేవే. కందులు, గుండు పోకలు, మామిడి పండ్లు, వెనిగర్, ఇసుకరాయి తదితర వస్తువులపై రాయితీ ఎత్తివేసింది. తాజా నిర్ణయం భారత్‌లోని చిన్న, మధ్య తరహా వ్యాపారాలపై అధిక ప్రభావం చూపనుంది. ముఖ్యంగా హస్తకళలు, వ్యవసాయ రంగాల ఉత్పత్తులకు అమెరికాలో గిరాకీ తగ్గే అవకాశముంది. భారత్‌తో పాటు అర్జెంటినా, బ్రెజిల్, థాయ్‌లాండ్, పాకిస్థాన్, టర్కీ, ఫిలిప్పీన్స్, ఈక్వెడార్, ఇండోనేషియా లాంటి దేశాల నుంచి దిగుమతి చేసుకునే వస్తువులపై కూడా అమెరికా రాయితీని ఎత్తివేసింది.

## జనసేనాని రైలు యాత్ర

సూచనలు చేసింది. విజయవాడ నుంచి తుని వరకూ వివిధ స్టేషన్‌లో పవన్‌కు శుభాకంక్షలు తెలిపేందుకు వచ్చే వాళ్లు విధిగా ప్లాట్‌ఫామ్ టికెట్ తీసుకుని, వాటిని బ్యాడ్జీలుగా ధరించి రావాలని సూచించారు. అక్కడి సెక్యూరిటీ సిబ్బందితో పాటు రైలు ప్రయాణికులకు ఇబ్బందులు కలిగించొద్దని పేర్కొన్నారు. పవన్ ప్రజలతో మమేకయ్యేలా వీలు కల్పించాలని కోరింది. రైలు ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు జాగ్రత్త వహించాలని తెలిపింది. మహిళలు, పెద్దలను గౌరవించాలని, ప్రతి కార్యకర్త, అభిమాని బాధ్యత గల పౌరుడిగా ప్రవర్తించాలని జనసేన పార్టీ విజ్ఞప్తి చేసింది.

## కర్ణాటక ఉపఎన్నికలు బిజెపికి షాక్

దీంతో రామనగర ఉపఎన్నికలో అనిత, చంద్రశేఖర్ మధ్య హోరాహోరీ పోటీ తప్పదని అంతా భావించారు. దీంతో రామనగర ఉపఎన్నిక అటు భాజపా, ఇటు జేడీఎస్‌కు ప్రతిష్ఠాత్మకంగా మారింది. ఈ నేపథ్యంలో మరో రెండు రోజుల్లో ఎన్నిక జరగాల్సి ఉండగా.. చంద్రశేఖర్ చివరి నిమిషంలో తన నామినేషన్‌ను వెనక్కి తీసుకున్నారు. దీంతో భాజపాకు ఊహించని ఎదురుదెబ్బ తగిలింది. అంతేగాక.. తాను మళ్లీ కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు చంద్రశేఖర్ ప్రకటించారు. భాజపాలో ఐకమత్యం లేదని, పార్టీలో తనకు ఎవరూ మద్దతుగా లేరని చంద్రశేఖర్ ఆరోపిస్తున్నారు. అందుకే తాను తిరిగి కాంగ్రెస్‌లోకి వెళ్తున్నట్లు చెప్పారు. కాగా.. చంద్రశేఖర్ తప్పుకోవడంతో అనిత కుమారస్వామి గెలుపు దాదాపు ఖరారైనట్లేనని తెలుస్తోంది. రామనగరలో నవంబరు 3న ఉపఎన్నిక జరగనుంది.

## భారత్ తెలిపిన అభ్యంతరాలపై చైనా స్పందన

పాక్-భారత్‌కు మధ్య ఉన్న విభేదాలను ఎప్పటికీ ఏ విధంగానూ ప్రభావితం చేయబోవు అని తెలిపారు. కాగా, ఇరు దేశాల మధ్య ఉన్న కశ్మీర్ వివాద సమస్యను చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని చైనా పలుసార్లు చెప్పింది.

చైనా పాక్ ఎకనామిక్ కారిడార్ కోసం 60 బిలియన్ల అమెరికన్ డాలర్లను ఖర్చు చేస్తున్న విషయంపై లు కాంగ్ స్పందిస్తూ... ఇది మా ఇరు దేశాలకు సంబంధించిన ఆర్థిక సహకార ప్రాజెక్టు మాత్రమే. ఇది మరో దేశాన్ని లక్ష్యంగా చేసుకుని చేపట్టిన ప్రాజెక్టు కాదు అని వ్యాఖ్యానించారు. కాగా, పీవోకే నుంచి బస్సులు నడిపేందుకు పాక్, చైనాలు సిద్ధమవడంపై భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రవీశ్ ఈ రోజు ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఆ బస్సు సేవలను ప్రారంభించడం.. భారత సార్వభౌమత్వాన్ని, ప్రాదేశిక సమగ్రతను ఉల్లంఘించడమే అవుతుందని ఆయన అన్నారు. ఈ బస్సు సేవలు పాకిస్థాన్‌లోని లాహోర్ నుంచి చైనాలోని కష్గర్ వరకు కొనసాగుతాయి.

## ప్రజల ఓట్లే గెలిపించేది

రామ మందిరం అంశం ఎన్నికల్లో ఓట్లు పడేలా చేయలేదని ఆయన అన్నారు. రాముడు తమను ఎన్నికల్లో గెలిపిస్తారని వాళ్లు(భాజపా) అనుకుంటున్నారు. రాముడు లేదా అల్లా మీరు ఎన్నికల్లో గెలిచేలా చేయలేరు. ప్రజలు ఎవరికైతే ఓట్లు వేస్తారో వాళ్లు మాత్రమే ఎన్నికల్లో విజయం సాధిస్తారు అని ఆయన తెలిపారు. రామమందిరం వివాదం చర్చకు రావడంపై మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నకు ఆయన బదులిచ్చారు. ఇక్కడ ఆలయం, మసీదు, గురుద్వార అనేది ప్రశ్న కాదు. మన దేశంలో ఎన్నో కులాలు, మతాలు ఉన్నాయి. ప్రతీ మతానికి ప్రత్యేక స్థానం ఉంది అని ఆయన తెలిపారు. ప్రతిపక్ష పార్టీల నేతలు కలిసి కూర్చొని చర్చించి రానున్న ఎన్నికలకు సంబంధించిన ప్రణాళికను రూపొందించనున్నట్లు ఆయన వెల్లడించారు. దేశాన్ని కాపాడేందుకు ప్రతిపక్ష పార్టీలు ప్రయత్నిస్తున్నాయని పేర్కొన్నారు.

# అగ్రిగోల్డ్ బాధితుల అరెస్టు

అమరావతి: నగరంలోని ధర్నా చౌక్ వద్ద అగ్రిగోల్డ్ బాధితులు 30 గంటల పాటు ధర్మాగ్రహ దీక్ష చేపట్టారు. ఈ దీక్షలో పాల్గొనేందుకు రాష్టంలోని 13 జిల్లాల నుంచి అగ్రిగోల్డ్ బాధితులు పెద్ద ఎత్తున చేరుకున్నారు.

దీక్ష సందర్భంగా ర్యాలీకి ప్రయత్నించిన అగ్రిగోల్డ్ బాధితులను పోలీసులు అనుమతి లేదంటూ అడ్డుకున్నారు. అంతేకాకుండా అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ వెల్ఫేర్ అసోషియేషన్ గౌరవ అధ్యక్షుడు ముప్పాళ్ళ నాగేశ్వరరావుతో పాటు పలువురు బాధితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

అరెస్ట్ చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని అగ్రిగోల్డ్ బాధితులు డిమాండ్ చేస్తున్నారు.

# వ్యర్థ నిర్వహణ కేంద్రాలు. ఇంకుడు గుంతలు వేగంగా పూర్తి చేయండి

### జిల్లా కలెక్టర్ ప్రవీణ్ కుమార్



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రవీణ్‌కుమార్

నర్సీపట్నం : ఉపాధి హామీ పనులలో లక్ష్యాలను వేగంగా పూర్తి చేయాలని ఎన్ఆర్ఇజిఎస్, మండల అధికారులను జిల్లా కలెక్టరు ప్రవీణ్ కుమార్ ఆదేశించారు. గురువారం సబ్ కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నర్సీపట్నం డివిజన్‌లో ఉపాధి హామీ పనుల ప్రగతిపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన గ్రామాలలో ఘన ద్రవ వ్యర్థ పదార్థాల నిర్వహణ కేంద్రాలు, ఇంకుడు గుంతలు ప్రగతిపై క్షుణ్ణంగా చర్చించారు. ఉపాధి హామీ పనులకు సంబంధించి ప్రాధాన్యత కార్యక్రమాలలో జిల్లా వ్యాప్తంగా లక్ష్య సాధనలో ముందుకు వెళ్లాలని అందుకు తగిన కార్యాచరణ రూపొందించాలని పేర్కొన్నారు. డిసెంబరు నెలాఖరు నాటికి వ్యర్థ పదార్థాల నిర్వహణ కేంద్రాలు పూర్తి చేయాలని, జనవరి 15 నాటికి ఇంకుడు గుంతల నిర్మాణం ముగించాలని ఆదేశించారు. వ్యర్థపదార్థాల నిర్వహణ కేంద్రాల నిర్మాణానికి తగిన స్థలాలను గుర్తించి వెంటనే పనులు మొదలు పెట్టాలన్నారు. . స్థానికులకు వాటి వలన కలిగే లాభాలను పర్యావరణ సమతుల్యతను గూర్చి అవగాహన కలిగించి వారిని ఒప్పించాలి అన్నారు. స్థలం లేని పంచాయతీలలో దగ్గరలో నున్న పంచాయతీ కేంద్రానికి అనుసంధానం చేయాలని సూచించారు. అనవసరంగా గొడవలు పెట్టిన వారి పట్ల కఠినంగా వ్యవహరించాలని అవసరమైతే పోలీసు వారి సహాయం తీసుకోవాలని చెప్పారు. వీలైనంత తొందరగా కేంద్రాలలో వర్మి కంపోస్టు తయారిని చేపట్టి ఆదాయ వనరులను పెంచాలన్నారు. ఘన వ్యర్థాల నిర్వహణ పనులలో విశాఖ జిల్లా రాష్టంలో తుది స్థానంలో ఉందన్నారు. ఇందుకు పనుల్లో జాప్యం ఒక కారణం అయితే, పూర్తి చేసిన పనుల వివరాలు ఆన్లైన్లో ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయకపోవడం మరో కారణం అన్నారు. ఈ సమస్యలన్నింటినీ అధిగమించి విశాఖ జిల్లా అను రాష్ట్రంలో ప్రధమ స్థానంలో నిలిపేందుకు అధికారులు కృషి చేయాలని ఆయన ఆదేశించారు. ఇళ్ల నుండి తడి పొడి చెత్త సేకరణ అవసరమైన డస్ట్ బిన్లు, ట్రై సైకిళ్లు, పవర్ ఆటోలు తదితర సామాగ్రిని సమకూర్చు కోవాలన్నారు. హరిత రాయబారులను ఏర్పాటు చేసుకొని ఇళ్లనుండి తడి పొడి చెత్త సేకరణ పనులను వెంటనే ప్రారంభించాలన్నారు. ఇంకుడు గుంతల నిర్మాణ పనులను సమీక్షిస్తూ, రెండువేలలోపు జనాభా గల ప్రతి గ్రామ పంచాయతీలో ఇంకుడు గుంతలను నిర్మించాలన్నారు. మరుగుదొడ్ల నిర్మాణ పనుల తరహాలో ప్రతి ఇంటికి ఇంకుడు గుంత నిర్మాణ పనులను యుద్ధ ప్రాతిపదికన నిర్వహించాలన్నారు. వచ్చే ఏడాది జనవరి 15 కల్లా ఈ ఇంకుడు గుంతల నిర్మాణం పనులను పూర్తి చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. గ్రామాలలో గల గృహాలను గుర్తించి ప్రతి ఇంటికి ఒక ఇంకుడు గుంతను ఏర్పాటు చేయాలన్నారు. మంజూరైన గుంతలు అన్నీ 90 రోజులలో పూర్తి చేయాలని ఆదేశించారు. మరుగుదొడ్ల నిర్మాణంలో అధికారులు ఎంతో చక్కగా పని చేశారని అదే స్ఫూర్తితో ఇంకుడు గుంతలను కూడా పూర్తి చేయాలన్నారు. పాఠశాలల ప్రహరీ ల నిర్మాణం గురించి కూడా సమీక్షించారు. రాష్ట్రంలో ఉపాధి హామీ పనులను పెద్ద ఎత్తున నిర్వహించడం వల్ల గత ఏడాది కంటే ఈ ఏడాది 46 శాతం లేబర్ బడ్జెట్ కేంద్రం రాష్టానికి మంజూరు చేయడం జరిగిందన్నారు. ఈ పెరిగిన లేబర్ బడ్జెట్ అనుగుణంగా జిల్లాలో ఉపాధి హామీ పనులను చేపట్టి ఉపాధి కూలీలకు పెద్ద ఎత్తున ఉపాధి పనులను కల్పించి వేతనాలను సకాలంలో చెల్లించాలని అధికారులకు ఆయన సూచించారు. 2014 -15 నుండి ఇప్పటి వరకు చేపట్టిన పలు ఉపాధి హామీ పనులు పూర్తి చేసి, పూర్తయినట్లుగా వాటి వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయకపోవడం వల్ల జిల్లాకు రావాల్సిన ఉపాధి హామీ నిధులు సకాలంలో అందటం లేదని కలెక్టర్ తెలిపారు. ఆయా పనులు వివరాలను వెంటనే ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయాలన్నారు. ఉపాధి హామీ కన్వర్జెన్స్ పనుల్లో భాగంగా వ్యవసాయ, అనుబంధ రంగాల్లో నిర్వహిస్తున్నామన్నారు. నిర్ణీత కాల వ్యవధిలో పూర్తి చేయాలన్నారు. పంట కుంటలు, వర్మీ కంపోస్టు యార్డు నిర్మాణ పనులను వేగవంతం చేయాలన్నారు. గ్రామాల్లో నిర్వహించే ఈ పనుల నిర్వహణ బాధ్యతను ఆయా గ్రామ పంచాయతీల స్పెషల్ ఆఫీసర్లు చేపట్టాలని, అన్ని శాఖల అధికారుల సమన్వయంతో ఆయా పనులను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ సిఇఒ రమణమూర్తి, జిల్లా పంచాయతీ అధికారి కృష్ణకుమారి, ఉపాధి హామి అడిషనరల్ పిడి మల్లిఖార్జున, వేస్ట్ మేనేజ్‌మెంట్ డిపిఒ నాగలక్ష్మి, ఉపాధి హామీ ఏపిడిలు, బుచ్చయ్యపేట, చోడవరం, గొలుగొండ, కోటవురట్ల, నక్కపల్లి, నర్సీపట్నం, నాతవరం, పాయకరావుపేట, రావికమతం,రోలుగుంట, మాకవరపాలెం, ఎస్.రాయవరం మండలాల తహశీల్దార్లు, ఎంపిడిఒలు గ్రామాల ప్రత్యేకాధికారులు పాల్గొన్నారు.

## 3నుంచి విశాలాంధ్ర విశాఖ పుస్తక మహోత్సవాలు



విశాఖపట్నం: ఈ నెల 3 నుంచి 25వ తేదీ వరకు నగరంలో టర్నర్ చౌల్ట్రీ ఆవరణలో విశాలాంధ్ర విశాఖ పుస్తక మహోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు విశాలాంధ్ర పుస్తకాల హౌసింగ్ మేనేజర్ పి.ఎ. రాజు అన్నారు. గురువారం టర్నర్ చౌల్ట్రీ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 19వ విశాలాంధ్ర విశాఖ పుస్తక మహోత్సవాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన అన్నారు. ఈ ప్రదర్శనలో సామాజిక, సాంస్కృతిక, ఆధ్యాత్మికత రంగాలకు చెందిన పలు పుస్తకాలను ప్రదర్శిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పి. రామకృష్ణ, డాక్టర్ వి. గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా జాతీయ సమైక్యతా దినం

కోయంబత్తూరు : అవినాశలింగం ఇన్‌స్టిట్యూట్ ఫర్ హోం సైన్స్ అండ్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఫర్ ఉమెన్‌లో జాతీయ సమైక్యతా దినాన్ని వేడుకగా నిర్వహించారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి రోజు సందర్భంగా దీన్ని పాటిస్తున్న విషయం తెలిసిందే. కార్యక్రమంలో తొలుత హిందీ విభాగాధిపతి డాక్టర్ శోభనా కొక్కడన్ ఆహూతులకు స్వాగతం పలికారు.

ఉప కులపతి డాక్టర్ ప్రేమావతి విజయన్ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. సమైక్య తకు ఉన్న ప్రాముఖ్యతను ఆమె వివరించారు. నైతిక విలువలు, జాతీయ సమైక్యత, దేశభక్తికి సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ అవినాశలింగం ఎంతో ప్రాధాన్యం ఇచ్చేవారన్నారు. యువత కూడా అదే తరహాలో నడుచుకోవాలని ఆయన కోరుకుంేవారని గుర్తు చేశారు. ఇన్‌స్టిట్యూట్ మాజీ డీన్ డాక్టర్ డి.లలిత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వల్లభాయ్ పటేల్ సమైక్యత కోసం పాటుపడిన మహోన్నత వ్యక్తి అని ఆమె పేర్కొన్నారు. దేశ సమైక్యత కోసం ఆయన విగ్రహావిష్కరణ జరగడం గొప్ప విషయమని, ఆయనొక ఉక్కు మనిషి అని అభివర్ణించారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విజేతలకు బహుమతులను పంపిణీ చేశారు. ఇన్‌స్టిట్యూట్ రిజిస్ట్రార్ డాక్టర్ కె.కౌసల్య తదితరులు హాజరయ్యారు. కళాశాల సిబ్బంది, విద్యార్థులు ఆయన చిత్రపటానికి నివాళు లర్పించారు. దేశ సమైక్యత కోసం కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు.

విజయభాను

## సంపాదకీయం

# జపాన్ బంధం

అంతర్జాతీయ రాజకీయరంగంలో వేగంగా మార్పులు వస్తున్న తరుణంలో భారత్, జపాన్ చేయి చేయి కలిపి సాగాలని నిర్ణయించుకోవడం అభినందనీయం. ప్రధాని మోదీ రెండు రోజుల జపాన్ పర్యటన ద్వైపాక్షిక సంబంధాల పటిష్టతకు దోహదపడ్డది. రెండు దేశాల మధ్య కుదిరిన ఆరు ఒప్పందాలు ద్వైపాక్షిక బంధాన్ని మరింత పటిష్టం చేస్తున్నాయి. అయితే జపాన్ ప్రధాని షింజో అబేతో ప్రధాని మోదీ జరిపిన చర్చలలో ద్వైపాక్షిక సంబంధాలతో పాటు ప్రాంతీయ, అంతర్జాతీయ పరిస్థితులు చర్చకు వచ్చాయి. పలు అంశాలపై రెండుదేశాల ఆలోచనల్లో సారూ ప్యం ఉన్నది. భారత్‌కు ప్రతి ఏటా శిఖరాగ్ర సమావేశం జరుపుకునే ఆనవాయితీ రష్యాతో పాటు జపాన్‌తోనే ఉన్నది. అంతర్జాతీయ రంగంలో సమూల మార్పులు వచ్చిన తరువాత పదమూడేండ్లుగా రెండు దేశాలు మరింత దగ్గరయ్యాయి. వాణిజ్య, సాంకేతిక, సైనిక, వ్యూహాత్మక సంబంధాలలో ఇరువురు నేతలు లోతుగా చర్చించారు. ఇటీవలి కాలంలో భారత్‌లో జపాన్ పెట్టుబడులు గణనీయంగా పెరిగాయి. శాస్త్ర సాంకేతిక రంగాలలో అతివేగంగా మార్పులు చోటు చేసుకుంటున్నాయి. చైనా అమెరికా యూరప్ దేశాలకు దీటుగా అనేక సాంకేతిక రంగాలలో ముందు నిలుస్తున్నది. ఆర్థిక శక్తిగా ఎదుగుతున్న భారత్‌కు సాంకేతిక రంగంలో చేదోడువాదోడుగా జపాన్ మైత్రి ఎంతో ఉపయోగకరం. సైబర్ స్పేస్, ఆరోగ్యం, రక్షణ, సముద్ర పరిశోధన, అంతరిక్షం వంటి భిన్న రంగాలలో జపాన్ తోడ్పాటు ఇవ్వనుంది. అతివేగ రైలు ప్రాజెక్టులలో జపాన్ సహకారం కూడా ఖరారయింది. ఆర్థికరంగంలో సుస్థిరతను సాధించే క్రమంలో భారత్ జపాన్‌తో కుదర్చుకున్న కరెన్సీ మార్పిడి ఒప్పందం కీలకమైనది. 75 బిలియన్ డాలర్ల కరెన్సీ మార్పిడి ఒప్పందం ప్రపంచంలోని ఇటువంటి అవగాహనలలో పెద్దది. రెండు దేశాల కేంద్రీయ బ్యాంకుల మధ్య జరిగే ఈ ఒప్పందం క్యాపిటల్ మార్కె ట్లో సుస్థిరతకు దోహదపడుతుంది. ఈ ఒప్పం దం ప్రకారం అంగీకరించిన మొత్తంలో యెన్ లు ఆర్బీఐకి అందుబాటులో ఉంటాయి. ఇదే విధంగా రూపాయలు జపాన్‌కు అందుబాటు లో ఉంటాయి. మార్కెట్ విలువ ప్రాతిపదికన లెక్కగడుతరు. ఈ విధానం వల్ల డాలర్ ద్వారా మారకం ఉండదు. రూపాయికి, యెన్‌కు డాల ర్ ఒత్తిడి నుంచి మద్దతు లభిస్తుంది. క్యాపిటల్ మార్కెట్‌కు, విదేశీ మారకానికి సుస్థిరత లభిస్తుంది. దేశాభివృద్ధికి విదేశీ పెట్టుబడులు అందుబాటులో ఉంటాయి. విదేశీ మారకం సమస్య ఏర్పడితే ఐఎంఎఫ్ దగ్గర చేయి చాపకుండా జపాన్ కరెన్సీ అందుబాటులో ఉంటుం ది. అయితే ఆ పరిస్థితి ఇప్పట్లో ఉండక పోవచ్చు. అక్టోబర్ 19 నాటికి భారత్ విదేశీ మారక నిలువలు 393 బిలియన్ డాలర్ల మేర ఉన్నాయి. రెండు దేశాల మధ్య కుదిరిన పరస్పర సైనిక వసతుల ఉపయోగ ఒప్పందం (అక్విజిషన్ అండ్ క్రాస్ సర్వీసింగ్ అగ్రిమెంట్- ఏసీఎస్ఏ) కూడా కీలకమైనది. ఈ ఒప్పందం మేరకు ఒక దేశ సైనిక వసతులను మరో దేశ సైన్యం ఉపయోగించు కోవచ్చు. ఇండో పసిఫిక్ ప్రాంతంలో రెండు దేశాలు కలిసి పనిచేయాలనుకుంటున్న నేపథ్యం, చైనా ఎదుగుదల ఈ ఒప్పందానికి దారి తీసింది. అంతర్జాతీయ పరిస్థితులు రెండు దేశాలను ఇటీవలి కాలంలో మరింత దగ్గరికి చేశాయనవచ్చు. అగ్రరాజ్యంగా ఉండి అంతకంతకూ క్షీణిస్తున్న అమెరికా, అగ్రరాజ్యంగా ఎదుగుతున్న చైనా- ఈ రెండు దేశాలు భారత్, జపాన్ చర్చలలో ప్రధాన స్థానం పొందాయి. ట్రంప్ అధ్యక్షుడైన తరువాత అమెరికా విదేశాంగ విధానం నమ్మలేని విధంగా మారింది. ట్రంప్ వాణిజ్య ఆంక్షలు ఇబ్బందికరంగా మారాయి. అమెరికా ఆంక్షల వల్ల భారత్ ఇబ్బంది పడుతున్నది. అమెరికా ఇతర దేశాలపై విధించిన ఆంక్షల వల్ల కూడా భారత్ ఇరుకునపడుతున్నది. రష్యా నుంచి రక్షణ సామాగ్రి దిగుమతి, ఇరాన్ నుంచి చమురు తెచ్చుకోవడం పట్ల అమెరికా ఆంక్షలు విధిస్తానని ఇంకా బెదిరిస్తూనే ఉన్నది. అమెరికాతో సంబంధాలు చెడకుండానే బయటపడాలని భారత్, జపాన్ భావిస్తున్నాయి. ట్రాన్స్ పసిఫిక్ ఒప్పందం అమెరికా వైదొలిగింది. దీంతో ఈ ప్రాంతంలో అమెరికా తోడ్పాటును ఆశించకుండానే నిలదొక్కుకోవడానికి జపాన్, భారత్, ఆస్ట్రేలియా ప్రయత్నిస్తున్నాయి. ఉత్తర కొరియాతో సత్సంబంధాలు నెలకొల్పుకుంటున్న అమెరికా తమ అభిప్రాయాలను పట్టించుకోవడం లేదనే భయం జపాన్‌కు ఉన్నది. జపాన్ ప్రధాని అబే చైనా పర్యటన జరిపి వచ్చిన మరుసటి రోజే ప్రధాని మోదీ జపాన్ వెళ్ళి చర్చలు జరిపారు. వేగంగా ఎదుగుతున్న చైనాతో వైరానికి దిగకుండానే, తమ ఉనికిని కాపాడు కోవడం ఎట్లా అనే సమస్య ఇటు భారత్‌కు, అటు జపాన్‌కు ఉన్నది.

# యువత సన్మార్గంలో నడవాలి

## జనసేన నాయకులు సీతారాం



కార్యక్రమంలో జనసేన నాయకులు కాంద్రేగుల సునీల్, గల్లా వినోద్, దాడి పరదేశినాయుడు, పాము పైడిరాజు, దాడి బుజ్జి, మారిశెట్టి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి : యువత సన్మార్గంలో నడిస్తేనే సమాజం అభివ ృద్ధి పథంలో దూసుకుపోతుందని జనసేన పార్టీ నియోజకవర్గ నాయకులు కొణతాల సీతారాం అన్నారు. మండలంలోని మారేడుపూడి గ్రామంలో జరిగిన అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సంద ర్భంగా గ్రామస్తులు సీతారాం ను ఘనంగా సన్మానించారు.

అనంతరం సీతారాం మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ప్రతి యువకుడు జీవితం విలువ తెలుసుకుని ముందుకు సాగాలన్నారు. యువకులు జీవితంలో ఎదగడానికి ఎల్లప్పుడూ తాను అండగా ఉంటానని హామీ ఇచ్చారు. మారేడుపూడి గ్రామ ప్రజలు తనపై చూపిస్తున్న అభిమానం ఎన్నటికీ మరువలేనిదని సీతారాం చెప్పారు. ఈ

# ఖలీలుల్లా షరీఫ్‌కు ప్రతిభా పురస్కారం



విజయనగరం: స్థానిక ఏ.టి..కె. వ్యవస్థాపకులు ఎం.డి.ఖలీలుల్లా షరీఫ్‌కు ఎక్స్‌రే సాహితీ సాంస్కృతిక సంస్థ (విజయవాడ) ప్రతిభా పురస్కారాన్ని ప్రదానం చేయనుంది. శుక్రవారం విజయవాడ ఘంటశాల నృత్య సంగీత కళాశాలలో ఈ అవార్డును ప్రసిద్ధ రచిత, చలన చిత్ర నటులు పరుచూరి గోపాలకృష్ణ చేతుల మీదుగా ప్రదానం చేయనున్నారు. ఏ.టి.కె. సంస్థ ద్వారా వృద్ధాశ్రమాన్ని, అనాధ పిల్లల ఆశ్రయాన్ని గత పదేళ్ళుగానిర్వహిస్తూ అనేకమంది అధికార, ప్రజా ప్రతినిధుల నుంచి ఖలీల్ ప్రశంసలు అందుకున్నారు. అంతేకాకుండా టెర్రాకోట్ అనే మట్టి తయారీ కేంద్రాన్ని స్థాపించి తద్వారా వచ్చే ఆదాయాన్ని పేదల విద్య, వైద్య సౌకర్యాల కోసం వెచ్చిస్తున్నారు. వీరి సేవలకు గుర్తింపుగా గత నెలలో మథర్ థెరిసా అవార్డు, డాక్టర్ అబ్దుల్ కలాం అవార్డు, విజయనగరం ప్రెస్‌కలబ్ ఏ.పియు. డబ్ల్యుజె నుంచి ఉత్తమ సేవ అవార్డు, మహాత్మాగాంధీ జయంతా సంద ర్భంగా గాంధీ మహాత్ముని పేరుమీద ఇచ్చిన అవార్డు, అనేక పురస్కారాలు పొందారు.

నిత్యం పేదల కోసం పనిచేసిన వీరిని ఉభయ రాష్ట్రాల గవర్నర్ గతంలో రక్త దానాన్ని ప్రోత్సహిస్తూ అనేక మంది కార్యకర్తలకు స్ఫూర్తిని ఇంపినందుకు ఉత్తమ సేవా అవార్డును కూడా ప్రదానం చేశారు. శుక్రవారం విజయవాడలో మండలి బుద్ధప్రసాద్, నన్నమనేని రాజకుమారి, రాష్ట్ర సృజనాత్మక మరియు సాంస్కృతిక సమితి ముఖ్య కార్యనిర్వాహణా ధికారి కుసుమంచి సుబ్రమ్‌హణ్యం సమక్షంలో ఈ అవార్డు కార్యక్రమం జరగనుంది.

# ఘనంగా జగన్‌కు స్వాగతం

## : ఎమ్మెల్సీ కోలగట్ల



విజయనగరం: వైయస్సాఆర్ పార్టీ అధ్యక్షులు, ప్రతిపక్ష నేత వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డిపై విశాఖలో హత్యాయత్నం తదుపరి ఆరోగ్య కారణాల రీత్యా పాదయాత్ర వాయిదా పడిన సంగతి తెలిసిందే! ఈ నేపధ్యంలో విజయ నగరం జిల్లాకు ఈ నెల 3వ తదేఈన రానున్నారు.

ఈ మేరుకు తమ నాయకుడికి స్వాగతం ఘనంగా స్వాగతం పల కాలని పార్టీ ఉత్తరాంధ్ర కన్వీనర్ కోల గట్ల వీరబద్రస్వామి పార్టీ శ్రేణులతో గురువారం సమావేశం అయ్యారు. పాదయాత్ర పున: ప్రారంభ సందర్భంగా స్థానిక వై జంక్షన్ నుంచి భారీ స్వాగత పలకాలని నిర్ణయించారు.

# హత్మాయత్నానికి పాల్పడిన వ్యక్తులపై చర్యాలు తీసుకోని తెదేపా ప్రభుత్వం గద్దెదిగాలి



గాజువాక: రాష్ట్ర ప్రతి పక్షనేత, వైకాపా రాష్ట్ర అధ్యక్షులు వైయస్‌జగన్ పై విశాఖ ఎయిర్ పోర్టులో హత్యాయత్నాకి పాల్పడిన నిందుతుడు శ్రీనివాస్ హెటల్ యజ మాని హర్షవర్ధన్‌పై చర్యలు తీసుకోలేని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే గద్దెదిగాలని వైకాపా గాజుక సమన్వయకర్త తిప్పలనాగిరెడ్డి డిమాండ్ చేసారు. గురువారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ వారం రోజులు గడుస్తున్న కనీసం హత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తిపై చర్యలు తీసుకోకపోవడం దారుణమని రాష్ట్ర ప్రభుత్వంపై ద్వజమెత్తారు. పైగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రష్ట్ర డిజిపిలు దీనిని తమకు అనుకూలంగా ప్రచారం చేసుకోవడం దౌర్భాగ్యమని ఆందోళన వ్యక్తం చేశారు. ఇది 5కోట్ల ఆంధ్రులను అపహాస్యం చేసినట్లేనని విమర్శించారు. ఇదేవిధంగా కొనసాగితే అధికార పక్షానికి ప్రజలు బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ నెల 3వ తేదీన విజయనగరంజిల్లా పాలకొండలో పాదయాత్రను ప్రారంభించేందుకు వైయస్ జగన్ విశాఖ ఎయిర్‌పోర్టుకు విచ్చేస్తున్నారని శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని ఘనస్వాగతం పలకాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో మార్డుపూడి పరదేశి, వెంపాడ అప్పారావు, నక్క వెంకటరమణ, కాకి నిర్మలరెడ్డి కటికల కల్పన,పల్లాచినతల్లి,ధార్మలశ్రీను కార్యకర్తలు పాల్గొన్నారు.

## సమయం

### 'స్వర్ణ మందిరం'

సిరపూదుల చిన్నది
భలే, భలే గున్నది రంజుభలేగున్నది
అదినా ఇంటి పేరు అన్నది
స్వర్ణ మంజిరినన్నది
సోకు మీద ఉన్నది
స్వర్ణ మందిరం లాంటి
బ్యాడీ బిల్డింగ్ ఉన్న దానినన్నది
నా కనురెప్పలు ఆర్పనివ్వకుండ ఉన్నది
అయస్కాంతనన్నది
స్వర్ణమంతా ఉన్నది
నా స్వర్ణ మందిరంలో అన్నది ...॥సిర॥
గజ్జెలు కట్టింది గల, గల లు మ్రోగిస్తున్నది
నర్తకినన్నది - నాట్యమాడుచున్నది
దాహం - దాహం గున్నదంటేను
గుటకలు వేస్తున్నావు
నీ దాహం తీరుస్తానన్నది
జాప్యం చేస్తేను పై అంతస్తుకు ఎక్కుతానన్నను
స్వర్గ సీమ తారలల్లా!
నాలానే తల్క్ - తల్క్‌నుంటరు
పై రుచులకు ఎగబాకరనేల
వాళ్లు అదే పనిలో ఉంటరు
బిజీ - బిజీగ ఉంటరు
కాల్‌షీట్ ఉన్నదా అన్నది ...॥సిర॥
ఆ, కట్టె, ఆ, కట్టు చీరనిండా పువ్వులే;
ఏ పువ్వుని ముద్దెట్టాలో తెలియకున్నది
గగన కుసుమమై మెరియాడుచున్నది
జ్యూవెల్లరీ షాపులల్లా! దీని ముందు
భళాదూర్ అన్నవి
ఆ, చూపుల్లో - కైపులు
ఆ, ఒంపుల్లో - సోంపులు
ఆ, గెంతుల్లో - తకదినలు
తల్చుకుంటే - తనివి తీర్చుకోవాలని ఉన్నది ...॥సిర॥

...కవితా రచన
యల్.సిద్ధూ
సెల్ నెం: 77029771293


# పంచాంగం

మాసం : ఆశ్వయుజ; తిథి :నవమి ఉ.7.10; దశమి రా.తె.4.54; మఖ రా.12.38; మ.వ.1.26ల 2.55.

శుక్రవారం 02-11-2018

a **మేషం** : ధనం ఏమాత్రం నిలబెట్టలేక పోయినా ఆర్థిక ఇబ్బంది అంటూ ఏదీ ఉండదు. పాత వస్తువులను కొని ఇబ్బందులను ఎదుర్కొంటారు. ట్రాన్స్‌పోర్టు, ట్రావెలింగ్ రంగాల వారికి కలిసిరాగలదు. దూర ప్రాంతాలకే చేయు ప్రయత్నాలు ఫలిస్తాయి. b **వృషభం** : కొంతమంది సూటిపోటి మాటలు పడ టం వల్ల మానసిక ఆందోళనకు గురవుతారు.సాంస్కృతిక, సేవా కార్యక్రమాల్లో చురుకుగా వ్యవహ రిస్తారు. కాంట్రాక్టర్లకు, బిల్డర్లకు పనివారలతో సమస్యలు తలెత్తుతాయి. రిజి స్ట్రేషన్లకు ఇది అనువైన సమయం కాదు. c **మిథునం** : మీరు చేసే పను లకు బంధువుల నుంచి విమర్శలు, వ్యతిరేకత ఎదుర్కొనక తప్పదు. ముఖ్యు లకు బహుమతులను అందజేస్తారు. d **కర్కాటకం** : ప్రముఖులను కలుసుకుని బహుమతులను అందజేస్తారు. మీలోని శక్తి సామ ర్థ్యాలు ద్విగుణీకృతమయ్యే అవకాశం దక్కుతుంది. ఉపాధ్యాయులకు మంచి గుర్తింపు లభిస్తుంది. వృత్తి, ఉద్యోగాలలో వారికి ఆదాయం సంతృప్తి కరంగా ఉంటుంది. ధన లబ్ధి పొందుతారు. e **సింహం** : ప్రైవేటు సంస్థలలోని వారికి ప్రతి విషయంలోనూ ఓర్పు , లౌక్యం అవసరం. మీ అభిరుచులకు తగిన వ్యక్తులతో పరిచయాలు పెంచుకుంటారు. విదేశాలకు వెళ్లడానికి చేయు యత్నాలు ఫలిస్తాయి. స్త్రీలకు పనివారితో చికాకులు ఎదురవుతాయి. ఉద్యో గస్తుల హోదా పెరగడంతో పాటు... బరువు బాధ్యతలు అధికమవుతాయి. f **కన్య** :ప్రభుత్వ కార్యక్రమాలలోని పనులు అను కూలిస్తాయి. స్త్రీలకు షాపింగ్, వ్యవహారాలలో మెళకువ అవసరం. నిరు ద్యోగులకు బోగస్ ప్రకటనలు, కొత్త వ్యక్తుల పట్ల అప్రమత్త అవసరం. గృహంలో చికాకులు తొలగి ప్రశాంతత నెలకొంటుంది. మీ సంతానం కోసం ధనం బాగా వ్యవం చేయవలసి వస్తుంది. g **తుల** : ఇప్పటివరకు విరోధులుగా ఉన్న వ్యక్తలను సుముఖం చేసుకోగలుగుతారు. ప్రేమికులు పెద్దల ఆగ్రహావేశాలకు గురికావలసి వస్తుంది. h **వృశ్చికం** : ఉద్యోగస్తులు కొత్త బాధ్యతలు స్వీకరిస్తారు. పెద్దల ఆరోగ్య, ఆహార విషయాల్లో మెళకువ అవసరం. ఉత్తర ప్రత్యుత్తరాలు సంతృప్తినిస్తాయి. i **ధనుస్సు** :వ్యాపా రాల్లో నూతన భాగస్వాములను చేర్చుకునే విషయంలో బాగా ఆలోచించి నిర్ణయం తీసుకోవలసి వస్తుంది. j **మకరం** : ఉద్యోగస్తుల శక్తి సామర్థ్యాలను అధికారులు గుర్తిస్తారు. మీ శ్రీమతి సలహా పాటించడం చిన్న తనంగా భావించ`కండి. విద్యా, వైజ్ఞానిక విషయాల పట్ల ఆసక్తి పెరుగుతుంది. విలాస వస్తువులు అమర్చు కోవాలనే స్త్రీల కోరికలు నెరవేరుతాయి. కాంట్రాక్టర్లకు ఇంజనీరింగ్ అధికారుల నుంచి అభ్యం తరరాలెదుర్కోవలసి వస్తుంది. k **కుంభం** : చిన్నాటి మిత్రులను, ప్రియమైన వ్యక్తులను కలుసు కుంటారు. L **మీనం** : వ్యాపారంలో పెరిగిన పోటీని తట్టుకోవడానికి అహర్నిశలు శ్రమిస్తారు. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. రుణ బాధలు తొలగుతాయి.

# విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



భీమునిపట్నం : అక్టోబర్ 29 నుండి నవంబర్ 3 వరకు అవినీతి వారోత్సవాల సందర్భంగా స్థానిక జూనియర్ కాలేజీ లో దేనా బ్యాంకు డాబాగార్డెన్స్ విశాఖపట్నం శాఖ వారు అవినీతిని రూపు మాపడానికి తీసుకోవలిసిన చర్యలపై వ్యాసరచన పోటిని నిర్వహించారు.ఇందులో ఎన్.ఎస్.ఎస్.వాలంటీర్లు పాల్గొన్నారు. ఈ పోటిల్లో ప్రదమ స్థానం సెకండ్ ఇయర్ ఎం.పి.సి. విద్యార్థిని పి.గీత, ద్వితీయ స్థానం ఎం.శృతికి తృతీయ స్థానం ఏ.షణ్ముఖరావు లకు కళాశాల వైస్ ప్రిన్సి పాల్ బి.వి.శ్రీనివాసరావు, దేనా బ్యాంకు డాబాగార్డెన్స్ విశాఖపట్నం శాఖ మేనేజర్ వి.కామాక్షి లు బహుమతులు అందజేసారు .ఈ కార్యక్రమంలో ఎన్.ఎస్.ఎస్. ఐ.పి..ఓ.లు పి.వేణుగోపాల్, ప్రసాదరావు, పి.పరమేష్ లు పాల్గొన్నారు.

# చంద్రన్న పెళ్లికానుక పంపిణీ



భీమునిపట్నం : తగరపువలస డివిజన్ ఒకట వవార్డు బంగ్లా మెట్ట లో వివాహం చేసుకుంటున్న మీసాల అనిత,లావేటి పోలినాయుడు లకు 35,000 చంద్రన్న పెళ్లికానుక ను తగరపువలస డివిజన్ టీడీపీ అధ్యక్షులు కొప్పల రమేష్ , అందించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రతి పేద కుటుంబానికి అమ్మాయి పెళ్ళి భారం కాకూడదనే దృక్పథంతో ఈ పథకం పెట్టారని, ఎన్నికల మేనిపేస్టులో లేనివి కూడా అవసరానుగుణంగా ఇలాంటి సంక్షేమ పథకాలు పెడుతున్నారని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో నాయకులు .చంద్ర మౌళి,టి.సూరిబాబు,కొప్పల .కృష్ణ .ఎం. త్రినాద్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్‌షాక్‌తో గిరిజనుడికి తీవ్ర గాయాలు

కొయ్యూరు : అడవిపందులను వేటాడే లక్ష్యంతో అక్రమంగా అమర్చిన విద్యుత్ తీగలు తగిలి ఓ గిరిజనుడు తీవ్ర గాయాల పాలయ్యాడు. మండలంలోని కొమ్మిక తాళ్లపాలెం గ్రామానికి చెందిన బోయిన గంగరాజు(49) తన కుమార్తెకు కొమ్మిక గంగవరం గ్రామానికి చెందిన చిరంజీవి అనే యువకుడితో గతంలో వివాహం జరిగింది. ఇటీవల గంగరాజు కుమార్తె పుట్టింటికి వచ్చి చాలా రోజులు గడుస్తునప్పటికీ పుట్టింది వద్దే ఉంది. ఈ కుటుంబ విషయమై మాట్లాడేందుకు బుధవారం గంగరాజు, గ్రామస్థుడు సీందరి తాతారావుతో కలిసి గంగవరం వెళ్లి రాత్రి మరలా స్వగ్రామం వస్తూ తాళ్లపాలెం గ్రామ శివారులో బహిర్భూమిరని దారి పక్కగా వెళ్లడంతో అడవి పందులను హతమార్చే లక్ష్యంతో ఏర్పరచిన విద్యుత్ తీగలు తగిలి శరీరమంతా గాయపడినట్లు గ్రామస్థులు తెలిపారు. దీంతో తాతారావు తన వద్ద ఉన్న తువ్వాలుతో బలంగా లాగి ఉండకపోతే గంగరాజు అక్కడిక్కడే మృతి చెంది ఉండేవాడు.

# యువకుడి దారుణ హత్య

రోలుగుంట : యువకుడి దారుణహత్య తీవ్ర కలకలం సృష్టించింది. రోలుగుంట మండలం శింగరాజుపేటలో చింతల నానాజీ అనే యువకున్ని గుర్తు తెలియని వ్యక్తులు దారుణహత్య చేశారు.. పోలీసుల కథనం ప్రాకరం ఎంకె.పట్నం పంచాయతీ శివారు శింగరాజుపేటలో విశాఖపట్నంకు చెందిన రిటైర్డు రెవెన్యూ అధికారి సత్యారావు అనే యాజమాని దాదాపు 17 ఎకరాల వరకు జామ, కొబ్బరితోటలను 20 ఏళ్ల క్రితం కొనుగోలు చేశారు. అయితే నాతవరం మండలం మర్రిపాలెం గ్రామానికి చెందిన చింతల సత్తిబాబు 10 ఏళ్ల నుంచి కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నారు. బుధవారం ఉదయం సత్తిబాబు భార్యకు అనారోగ్యం చేసిందని, ఆసుపత్రికి తీసుకువెళ్లి చూపించి వస్తానని గొలుగొండ మండలం చోద్యంలో నివాసం ఉంటున్న సత్తిబాబు తమ్ముడు చింతల నానాజీ(28) ఫోన్ చేయగా నానాజీ సాయంత్రం 4 గంటలకు రాగా రాత్రికి ఇక్కడే తోటలో కాపు ఉండూ అని చెప్పి సత్తిబాబు, నానాజీ ఇద్దరు కలిసి బుధవారం రాత్రి 8 గంటల సమయంలో ఏటిగైరంపేటలో సెల్‌ఫోన్ రిపేరు చేయించుకొని సత్తిబాబు మర్రిపాలెం వెళ్లిపోగా నానాజీ శింగరాజుపేటలో కొబ్బరితోట నివాసానికి వచ్చేశాడు. కొబ్బరితోటకు సత్తిబాబు వచ్చేయగా నానాజీ కనిపించకపోవడంతో ఉదయం తోట అంతా తిరిగాడు. ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ అవడంతో మరింత భయాందోళనకు గురై చుట్టు తిరుగుతూ చూడగా శివారున తోటలో పొదలో చూడగా రక్తపు మడుగులో విగత జీవిగా పడి ఉన్న నానాజీ మృతదేహన్ని చూసి స్థానికులకు, పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి నర్సీపట్నం ఏఎస్పీ ఆరీఫ్‌హఫిజ్, రూరల్ సిఐ రేవతమ్మ, రోలుగుంట ఎస్సై సిహెచ్.హరికృష్ణ వచ్చి మృతదేహన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. పోలీసులు అక్కడే శవపంచనామా నిర్వహించారు.

రోజుకి రూ. 25/- మాత్రమే
Size 1x3
Minimum 7 days
విజయభాను క్లాసిఫైడ్స్
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్: 2564353, 2569004

DMK ITI (p)
TRADES: Electrician & Fitter Scholorship for Eligible Candidates
Note: అతి తక్కువ ఫీజులకు సీటు ఇవ్వబడును
Sabbavaram, Visakhapatnam (Dt.) 531035
Contract: 83090 08289

APOSS (ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఓపెన్ స్కూల్)
Direct: SSC & Inter ( Any group ) One Sitting pass Guarantee, DMK Junior College, Sabbavaram, Visakhapatnam (Dt). 531035
Contact: 9441426955, 7396221464

SREE KUSUMA HARANATH COLLEGE OF EDUCTION (D.ED.,)
2017-19 Batch సీట్లు అతి తక్కువ ఫీజులకు ( 1 సం. కలిసొచ్చును )
2017-19 Batch సీట్లు కూడా అతి తక్కువ ఫీజులకు ఇవ్వబడును.
Sabbavaram, Visakhapatnam (Dt). 531035
Contact: 9441426955, 7396221464

## బూదరాళ్లలో గ్రామదర్శిని కార్యక్రమం

కొయ్యూరు : మండల కేంద్రానికి సుదూరంలో అభివృద్ధికి ఆమడదూరంలో ఉన్న తమ బూదరాళ్ల పంచాయతీ గ్రామాల్లో వీధిదీపాలు వెలిగించాలని, గ్రామాల్లో తాగు నీటి సౌకర్యం కల్పించాలని గిరిజనులు గురువారం జరిగిన బూదరాళ్లలో నిర్వహించిన గ్రామదర్శినిలో అధికారులను కోరారు. తమగ్రామాల్లో మౌలిక వసతులు కల్పనకు అధికారులు చొరవ చూపాలని పలు గ్రామాల గిరిజనులు కోరారు. ఈ కార్యక్రమంలో ఈఒపిఆర్‌డి వరలక్ష్మి, ఎంఇఒ బోడంనాయుడు, కొండబాబు, పిఆర్‌జెఇ బసవేశ్వర రావు, విశ్వతేజ సిడిపిఒ గౌతమి పాల్గొన్నారు.

## అవినీతి రహిత సమాజం లక్ష్యం కావాలి



విశాఖపట్నం : అవినీతి రహిత సమాజం కోసం పోరాడాలని ఈస్ట్‌పాయింట్ కాలనీ ఆంధ్రాబ్యాంక్ చీఫ్ మేనేజర్ విన్నకోట నాగరాజు అన్నారు. అవినీతి నిర్మూలనా వారోత్సవాల్లో భాగంగా ఈస్ట్‌పాయింట్ కాలనీలోని గాయత్రీ విద్యాపరిషత్ ఎంఎల్‌బీటీ స్కూల్‌లో కార్యక్రమం నిర్వహించారు. విజేతలకు ఆయన గురువారం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకులు ప్రజాసేవలో అంతర్భాగమని, సేవా లోపం కలిగితే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయవచ్చు నన్నారు. అలాగే లంచం, అవినీతి ఇతర ప్రజావ్యతిరేక కార్యక్రమా లకు పాల్పడినవారికి కేంద్ర నేరాన్వేషణ సంస్థ (సీబీఐ)కి ఫిర్యాదు చేయవచ్చునన్నారు. విద్యార్థులు బాల్యం నుంచే సత్‌ప్రవర్తన కలిగి ఉండాలన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ కె.మధురవాణి మాట్లాడుతూ బాల్యంలో మంచి పనులు జీవితానికి బలమైన పునాదిగా నిలుస్తాయన్నారు. ఈ సందర్భంగా పలు పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో బ్యాంకు అధికారులు వి.సుభద్ర, ఉషా, ఇతర అధికారులు, సిబ్బంది, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

# అనకాపల్లిలో ప్రారంభమైన టీడీపీ సభ్యత్వ నమోదు



అనకాపల్లి : అనకాపల్లి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ తన కార్యాలయంలో గురువారం ప్రారంభించారు. తొలి సభ్యత్వాన్ని తెలుగుదేశం పార్టీ అర్బన్ జిల్లా ఉపాధ్యక్షులు మళ్ల సురేంద్రకు అందజేసారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే పీలా మాట్లాడుతూ గత సంవత్సరం నియోజకవర్గంలో 26,000 మంది కార్యకర్తలు సభ్యత్వ నమోదు చేసుకున్నారని ఈ ఏడాది 40,000 మంది కార్య కర్తలు సభ్యత్వ నమోదు చేసుకోవాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో రూరల్ జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్ద నాగజగదీష్, డాక్టర్ నారాయణరావు, ఆర్‌ఈసీఎస్ చైర్మన్ మలసాల రమణారావు, ఎంపీపీ కొణతాల వెంకట సావిత్రి, పచ్చికూర రాము, కొణతాల వెంకట్రావు, కొణతాల శ్రీనువాసరావు, సిదిరెడ్డి శ్రీనువాసరావు, తదితరులు పాల్గొన్నారు.

# త్రాగునీటి ఇబ్బందులను పరిష్కరించండి

## మున్సిపల్ ఉన్నతాధికారులకు ఎమ్మెల్యే, ఛైర్మన్ వినతి



విజయనగరం : విజయనగరం ప్రజలు ఎదుర్కొంటున్న త్రాగునీటి ఇబ్బందులను పరిష్కరించడానికి తక్షణ చర్యలు తీసుకోవాలని మున్సిపల్ ఉన్నతాధికారులకు ఎమ్మెల్యే మీసాల గీత, మున్సిపల్ చైర్మన్ ప్రసాదుల రామకృష్ణ విజ్ఞప్తి చేశారు. విజయనగరం పట్టణ త్రాగునీటి ఇబ్బందుల పరిష్కారం కోసం ఎమ్మెల్యే మీసాల గీత, మున్సిపల్ చైర్మన్ ప్రసాదుల రామకృష్ణ అమరావతిలో మున్సిపల్ ప్రిన్సిపల్ సెక్రటరీ కరికల్ వలవన్, డిఎంఎ కన్నబాబులను కలసి సమస్యలను వివరించారు. జివిఎంసి నుండి విజయనగరం పట్టణానికి కొంతకాలంపాటు నీటిని సరఫరా చేయుటకు చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ముసిడిపల్లి పథకం వద్ద వెల్స్ రీఛార్జ్‌కోసం తాటిపూడి నుండి నీటిని తక్కువ మొత్తంలో సైఫన్ పైపులు ద్వారా విడిచిపెట్టుటకు అనుమతులు మంజూరుకు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే పట్టణ ప్రజల త్రాగునీటి ఇబ్బందులకు శాశ్వత పరిష్కారం లభించే విధంగా ప్రయత్నించాలని కోరారు. ఈమేరకు సానుకూలంగా స్పందించిన అధికారులు సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుని వెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే నిపుణులతో కమిటీని ఏర్పాటుచేసి సమస్య శాశ్వత పరిష్కారానికి ప్రణాళికలను సిద్ధం చేస్తామన్నారు. అలాగే రోడ్లవిస్తరణకు దేవాదాయశాఖ ద్వారా తలెత్తుతున్న ఇబ్బందులను పరిష్కరిం చాలని కోరుతూ ఆశాఖ ఉన్నతాధికారులు మన్మోహన్‌సింగ్, విష్ణులను కలసి సమస్యలను వివరించారు. రోడ్ల విస్తరణకు సానుకూలంగా దేవాదాయశాఖ సహకరించేవిధంగా ఆదేశాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ టి.వేణుగోపాల్, పబ్లిక్ హెల్త్ ఇఇ గణపతిరావు, మున్సిపల్ ఇంజనీరు మత్స్యరాజు, కౌన్సిలర్లు రొంగలి రామారావు, ముద్దాడ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# జగన్ ఆరోగ్యం కుదుటపడాలని ప్రత్యేక ప్రార్ధనలు



మాధవధార : వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ఆరోగ్యం కుదుటపడాలని మురళీనగర్‌లో జీసెస్ వర్డ్ ఆఫ్ లైఫ్ మినిస్ట్రీస్ సంస్థలో ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. ఈ కార్యక్రమం వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర కార్యదర్శి సనపల చంద్రమౌళి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి ఆరోగ్యం కుదుటపడాలని ఎంతోమంది పూజలు, ప్రార్ధనలు చేస్తున్నారని అన్నారు. ప్రజల పక్షాన నిలబడి నిరంతరం ప్రజల సమస్యలపైన అనేక పోరాటాలు నిర్వహిస్తున్న జగన్మోహన్‌రెడ్డి పై హత్యాయత్నం చేయడం దురదృష్ట కరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జీవన్‌వర్డ్ ఆఫ్ లైఫ్ మినిస్ట్రీస్ నిర్వాహకులు, ఫాస్టర్స్ ఇసాక్, దేవానందం, ఫిటర్, నంబాళ్ళ ఈశ్వరరావు, పప్పల సునీత, చిట్టితల్లి, దమయంతి, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి ప్రధాత 'చిక్కాల' గణేష్

- అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించిన గడియారస్థంభం
- సుందరంగా తయారైన చంద్రబాబు ఆరోగ్య ఉద్యానవనం
- నేడు మున్సిపల్ ఛైర్మన్ 'చిక్కాల' జన్మదిన వేడుకలు




అమలాపురం : అమలాపురం పురపాలక సంఘం ఛైర్మన్ చిక్కాల వినాయకరావు (గణేష్) పట్టణ సర్వతోముఖాభివృద్ధికి నిరంతరం శ్రమిస్తున్నారు. తెల్లవారుజాము నుండి రాత్రి వరకు పట్టణాభివృద్ధికై తపిస్తూ.. అధికారులను సమన్వయపరుచుకుంటూ ఏళ్ళతరబడి అపరిష్కృతంగా వున్న సమస్యలకు పరిష్కారం చూపిస్తున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తూచ తప్పకుండా అమలుచేస్తూ... నాణ్యతాప్రమాణాలతో పనులను తన స్వీయపర్యవేక్షణతో చేయిస్తూ... ప్రజాపాలకుడిగా అందరి మన్ననలు పొందుతూ నిజాయితీ నిబద్ధతతో ముందుకు సాగుతున్నారు. పట్టణంలో పేరుకుపోయిన పలు సమస్యలను ప్రణాళికాబద్ధంగా పరిష్కరిస్తూ పట్టణ ప్రజల హృదయాల్లో చోటు దక్కించుకుంటున్నారు అమలాపురం మున్సిపల్ ఛైర్మన్ చిక్కాల. అభివృద్ధికి ఆమడ దూరంలో ఉండే అమలాపురం మున్సిపాలిటీ నేడు అభివృద్ధి పథంలో పరుగులు తీస్తోంది. ఒకవైపు నిధుల లేమి ఉన్నప్పటికీ ఆ సమస్యను అధిగమించి పట్టణాన్ని అభివృద్ధి చేస్తున్న తీరుకు పలువురి ప్రశంసలు అందుకుంటున్నారు. ఉదయం 5 గంటల నుండి 9 గంటల వరకు అన్ని వార్డుల్లో కాలినడకన పర్యటించి అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనుల పరిశీలనతో పాటు శానిటేషన్ పనులను పర్యవేక్షించిన ఘనత గణేష్‌కే దక్కుతుంది. పట్టణంలో తాగునీటి సరఫరా జరుగుతున్న తీరుతెన్నులను ఎప్పటికప్పుడు పరిశీలన చేసి తదనుగుణంగా మార్పులుచేసి ప్రజల మెప్పు పొందారు.

నాడు మురికికూపం... నేడు నందన ఉద్యానవనం... : నిన్న మొన్నటి వరకు మురికి కూపాలుగా ఉన్న ప్రాంతాలు సైతం సుగంధాలు వెదజల్లే సుందరమైన పార్కులుగా దర్శనమిస్తూ ప్రజలకు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. మున్సిపాల్టీలోని కుళాయిచెరువు ప్రాంతం గతంలో ఎంతో దుర్గంధభరితంగా కాలుమోపడానికి వీలులేని విధంగా ఉండేది. అటువంటి చెరువును సుందరమైన ఉద్యానవనంగా తీర్చిదిద్దడంలో చైర్మన్ గణేష్ రేయింబవళ్లు శ్రమించి స్వయంగా ఆయనే దగ్గరుండి పనులను పర్యవేక్షించి ఎక్కడా నాణ్యతకు తగ్గకుండా పనులు చేయించి ప్రశంసలు పొందుతున్నారు. గడిచిన రెండేళ్లలో రూ. 45 కోట్ల మేర అభివృద్ధి నిధులు సాధించిన గణేష్ తాగునీటి సమస్యను పరిష్కరించేందుట పెద్దపీట వేసి రెండు చెరువులను అభివృద్ధి చేసేందుకు అత్యధిక మొత్తంలో నిధులు కేటాయించి మూడు ఓవర్‌హెడ్ ట్యాంకులు నిర్మాణాన్ని చేపట్టారు. రూ. 8.50 కోట్ల నిధులతో మంచినీటి చెరువు చుట్టూ పైలెట్ ప్రాజెక్టుగా సుందరమైన ఉద్యానవనం తయారుచేస్తున్నారు. 0.75 కిలోమీటర్ల మేర రింగ్‌బండ్ ఏర్పాటుచేసి దాని చుట్టూ ప్రజలకు వాకింగ్ ట్రాక్ తయారుచేసారు. దీనిని కలుపుకుని ఉన్న ప్రాంతాన్ని పిల్లల పార్కుగా తయారుచేసేందుకు చక్కటి ప్రణాళికతో ఆ ప్రాంతాన్ని అంతా గ్రీన్ గ్రాస్‌తో ఉద్యానవనంగా తయారు చేస్తున్నారు. దీనికి చంద్రబాబు ఆరోగ్య ఉద్యానవనంగా నామకరణం చేసారు.

ఆకట్టుకుంటున్న గడియారస్థంభం : బ్రిటీష్ వారి కాలంలో అమలాపురం పట్టణంలో ప్రజలు సమయాన్ని తెలుసు కునేందుకు ప్రధాన సెంటర్‌లో గడియారస్థంభాన్ని నిర్మించారు. దీంతో ఈ సెంటర్‌కు గడియారస్థంభం సెంటర్ అని పేరు వచ్చింది. ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకున్న ఈ గడియారస్థంభాన్ని తొలగించి ప్రస్తుత ఛైర్మన్ చిక్కాల గణేష్ 60 లక్షల రూపాయల నిధులతో అత్యాధునిక పరిజ్ఞానంతో నూతన గడియార స్థంభాన్ని నిర్మించారు. చూపరులను ఆకట్టుకున్న ఈ నూతన గడియార స్థంభం పట్టణానికి తలమానికంగా మారింది. త్వరలో వీటన్నింటిని ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. డ్రైనేజీ వ్యవస్థను రూ. 9.50 కోట్లతో నిర్మించి ఎప్పటికప్పుడు డ్రైన్లను శుభ్రపరుస్తున్నారు. అలాగే పట్టణంలో డివైడర్ల వ్యవస్థను పటిష్టం చేసి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకున్నారు. పట్టణంలో రూ. 80 లక్షలతో డివైడర్ల మధ్యలో అందమైన మొక్కలు నాటి పర్యావరణానికి పెద్దపీట వేస్తున్నామని ఛైర్మన్ చాటి చెప్పారు. తామరచెరువు చుట్టూ బెర్మ్ ఏర్పాటుచేసి బండ్ నిర్మించారు. 50 ఏళ్ళుగా ఈ చెరువులో పూడికతీత తియ్యని పరిస్థితి నెలకొంది. ఇది గమనించిన గణేష్ చెరువు పూడికను తీయించారు. చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్, పిల్లల పార్కులను అభివృద్ధి చేస్తున్నారు. 28వ వార్డులో ఆధునిక వసతులతో స్మశానవాటికలో క్రిమిలేషన్ బెడ్‌ను నిర్మించడంలో మున్సిపల్ చైర్మన్ చిక్కాల గణేష్ కృషి మరువరానిది. కొంకాపల్లి ఎత్తు రోడ్డు వద్ద కూడా క్రిమిలేషన్ బెడ్ నిర్మాణానికి కృషిచేసారు. పట్టణంలో సెంటర్ లైటింగ్, సీసీ కెమెరాలు ఏర్పాటువల్ల ప్రమాదాల నివారణే కాకుండా ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు పెద్దపీట వేసారు. అమలాపురం పట్టణంలో శుభ్రతకు పెద్దపీట వేసారు. అందువల్లే స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో అమలాపురం మున్సిపాలిటీ మంచి పేరు ప్రఖ్యాతలు, అవార్డులు చిక్కాల గణేష్ హయాంలో దక్కించుకుంది. గడిచిన రెండేళ్లలో అమలాపురం మున్సిపాలిటీని ఎన్నడూ లేని విధంగా అభివృద్ధిలో అగ్రగామిగా నిలిచిందని చిక్కాల చెప్పారు. స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా ఒక ప్రత్యేకమైన టీమ్‌ను తయారుచేసి వారితో కలిసి ప్రతిరోజు తెల్లవారు జామునే పట్టణంలో అన్ని వార్డుల్లో పర్యటించి పారిశుధ్యాన్ని సక్రమంగా జరిగే విధంగా స్వయంగా పర్యవేక్షిస్తారు. అయితే అభివృద్ధి ప్రధాత, ప్రస్తుత మున్సిపల్ ఛైర్మన్ చిక్కాల గణేష్ జన్మదిన వేడుకలు నేడు ఘనంగా జరగనున్నాయి.

## ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

### తాణాం గ్రామదర్శినిలో జడ్పిటిసి పైలా



పరవాడ:ప్రభుత్వము ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలును అర్హులైన లబ్ధిదార్లు అందరూ సద్వినియోగము చేసికోవాలని జడ్పిటిసి సభ్యులు పైల జగన్నాదరావు అన్నారు.గురువారము అయన తాణాం పంచాయితీలో జరిగిన గ్రామదర్శిని కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పోల్గోన్నారు. అనంతరము అయన మాట్లడుతూ ప్రజా సమస్యలు పరిష్కరముకోసమే ఈగ్రామదర్శిని కార్యక్రమాన్ని చేపడుతున్నామని దీనిని ప్రతి ఒక్కరూ సద్వినియోగము చేసికోవాలని అన్నారు. రాష్టఅబివృద్ది ఒక్క తెలుగుదేశంపార్టితోనే సాద్యపడుతుందని ఈసందర్భంగా అయన అన్నారు.ఈకార్యక్రమంలో మండలప్రత్యేకాదికారి బి.విజయప్రసాద్ , ఎమ్ ఇ ఒ సునీత,ఎంపిడిఒ కరుణకుమారి, ఇఒఅర్ డి హేమ సుందర్,అర్ డబ్లూయస్ ఎఇ షణ్ముఖ,ప్రభుత్వవైద్యాదికారి ప్రమీల, ఎఒ పోతల సత్యనారాయణ, మండల ఇంజినేర్ సుదాకర్ ,ఎపిఎమ్ రంగారావు తదితరులు పాల్గొన్నారు.

**41 వార్డులో తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం**

కంచరపాలెం : జీవీఎంసీ 41 వ వార్డులో తెలుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం గురువారం అశ్వనిపాలెం వద్ద జరిగింది .టీడీపీ వార్డు నాయకుడు పెంటకోట అజయ్ బాబు నేతృత్వంలో జరిగిన కార్యక్రమములో స్థానికులు మహిళలు ఉత్సాహంగా పాల్గొని టీడీపీ సభ్యత్వం తీసుకున్నారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుదేశం ప్రవేశ పెట్టిన పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని అదేవిధంగా టీడీపీ సభ్యత్వ నమోదు ద్వారా కొన్ని పథకాలు తీసుకోవచ్చని ఈ సందర్భంగా అయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో 40 వార్డు ప్రధాన కార్యదర్శి సదరం జ్ఞానేష్, పోతల నాయుడు ,ఎర్రినాయుడు ,తిరుపతిరావు , పివి రమణ , శ్రీను మరియు అధిక సంఖ్యలో మహిళలు స్థానికులు పాల్గొన్నారు.

# గడపగడపకు నవరత్నాల కార్యక్రమం



విశాఖపట్నం: జగనన్నకు తోడుగా రావాలి జగన్-కావాలి జగన్ కార్యక్రమంలో భాగంగా దక్షిణ నియోజక వర్గం లోని 15 వార్డులోని 222, 223 బూత్ లలో గడపగడపకు నవరత్నాల కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా దక్షిణ నియోజకవర్గ వైఎస్ఆర్ సీపీ సమన్వయకర్త డాక్టర్ పైడి వెంకట రమణమూర్తి హాజరై గడపగడపకు వెళ్లి జగనన్న నవరత్నాల పై అవగాహన చేపట్టారు. స్థానిక మహిళలు హారతులతో, ఆహ్వానాలతో డాక్టర్ రమణ మూర్తి కి ప్రజలు జేజేలు పలికారు. రాజన్న బిడ్డకు మేమంతా తోడు ఉంటామని ప్రజాలు తమ హర్ష ద్వానాలు వ్యక్తపరిచారు .ఈ కార్యక్రమం 15 వ వార్డు అధ్యక్షుడు నీలపు సర్వేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పైడి వెంకటరమణ మూర్తి మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమం కోసమే జగనన్న నవరత్నాలు ప్రకటించారు అని అన్నారు. రానున్న రోజుల్లో రాజన్నారాజ్యం వస్తుంది అన్నారు. దేవుడి దయవల్ల జగనన్న ఆరోగ్యంగా ఉన్నారని. రెండురోజులలో ప్రజల ముందుకు వస్తున్నారని తెలిపారు. 222 బూత్ ప్రెసిడెంట్ చక్రపాణి 223 బూత్ ప్రెసిడెంట్ శ్యాం ప్రసాద్ లతోపాటు రాష్ట్ర అధికార ప్రతినిధి జాన్ వెస్లీ, నగర మహిళా అధ్యక్షురాలు గరికన గౌరీ మరియు రాష్ట్ర జిల్లా ప్రతినిధులు. వార్డు మహిళా అధ్యక్షురాలు లక్ష్మి .వార్డు మాజీ ప్రెసిడెంట్ లంక శ్రీనివాస్, జ్యోతి ,గోపి ,వేణి, అప్పారావు, ప్రసాద్, సిహెచ్ రాజు, రఘు అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. జగనన్న త్వరగా కోలుకోవాలని ప్రజల మధ్యకు రావాలని స్థానిక చర్చి లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

**IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE AT BHEEMUNIPATNAM**
**I.A. 1/2016 IN O.S.37/2013**

**Between**
**Maddi Sanyasi Rao & 2 others**
**...Plaintiffs/Petitioners**
**And**
**Botsa Guruvulu(Died) & others**
**...Respondents/Defendants**
**To**
**Botsa Appalakonda**
**D/o.(L) Guruvulu, Hindu, 35 yrs,**
**R/at.D.No.1-2-78, Near BHPV**
**Akkireddypalem**
**Visakhapatnam.**

**NOTICE**

ఇందుమూలంగా ప్రజల యావన్మంది తెలియజేయునది ఏమనగా Botsa Guruvulu లకు మిమ్మల్ని వారసులుగా చేర్చమని పై నెంబరు దావాలో వాదిగారు పిటిషన్ పెట్టినందున, పై నంబరు దావా వాయిదా **తేది 09-11-2018న** మీ తాలుకా హాజరు నిమిత్తం వాయిదా అయ్యివున్నది. కావున పై వాయిదాకు మీరు స్వయంగా గాని, వకీలు ద్వారా గాని పై కోర్టులో **09-11-2018న** హాజరు అయ్యి మీ తరపున వాదన తెలియజేసుకోవలెను. లేనిచో మీ పరోక్షముగా శ్రీ కోర్టు వారు వాది వారికి డిక్రీ ఇవ్వడం జరుగునని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

Bheemunipatnam
Dt: 31/10/18

**By Order**
**M.V.Parvateesam**
**(పిటిషనర్ తరపు న్యాయవాది) Notary**
**# 11-30-21, Subash Road**
**Bheemunipatnam-531 163**
**Cell No:9849652677, 229021**

**In the Hon'ble Court of the Senior Civil Judge Vizianagaram.**
**HMOP. 30/2018**

**Between:**
**Nekkala Satyanarayana ...Petitioner**
**And**
**Nekkala Sujatha ...Respondent**
**To,**
**Nekkala Sujatha**
**W/o.Satyanarayana,**
**R/o Vasanth Vihar,**
**Vizianagaram.**

Please take notice that the petitioner filed the above petition against you, under section 9 of Hindu Marriage Act, and the above matter is posted to **5-11-2018** for your appearance. Hence you are here by informed to appear in person or by your pleader on.**5-11-2018 at 10.30 A.M,** before the Hon'ble court without fail or else above matter will be decided in your absence.

**CH.Rambabu**
**Advocate for Petitioner**
**Vizianagaram.**

# 14నుంచి జిప్‌మెర్ సేవలు

## యానాంలో మంత్రి మల్లాడిచే వైద్య సేవలు ప్రారంభం

యానాం: పాండిచ్చేరి గవర్నమెంటు తరపున ఆరోగ్య మంత్రి మల్లాడి కృష్ణారావు మరయు జిప్‌మెర్ ఆసుపత్రి తరపున జిప్‌మెర్ డైరెక్టర్ మధ్య కుదిరిన ఒప్పందం ప్రకారం జిప్‌మెర్ ఆసుపత్రి నుండి ప్రతీ నెలా నలుగురు వైద్య నిపుణులు యానాం వచ్చి అక్కడి రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించెదరు. ఈ ఆరోగ్య పరీక్షలలో గుండె జబ్బులు, కిడ్నీ వ్యాధి, క్యాన్సర్ వ్యాధి, స్త్రీల సంబంధమైన రోగులను పరీక్షించి వ్యాధి నిపుణులు వచ్చి రోగులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించెదరు. వ్యాధి నిర్ధారణ అయిన తరువాత ఏ విధమైన వైద్యము చేయిస్తే మంచిదో వ్యాధిని గురించి రోగికి తెలియజేస్తారు. పాండిచ్చేరి వచ్చి ప్రత్యేక వైద్యం పొందేందుకు తగిన ఆర్థిక స్తోమత లేని వారికోసం యానాంలోని పరీక్షలు చేయించుకుని వ్యాధి నివారణకు తగిన మందులు వాడవచ్చు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్ బాలచంద్ర (కార్డియాలజిస్ట్ నిపుణులు), డాక్టర్ రెడ్డిక పరశు రామన్, డాక్టర్ గుదిశీలన్, డాక్టర్ దాసరి పాప తదితరులు పాల్గొందురని ఒక ప్రకటనలో తెలిపారు. అత్యవసర చికిత్స కావాలంటే మాత్రం పాండిచ్చేరి వెళ్లవలసి ఉంటుందని వైద్యులు తెలిపారు.

# భావకవితా శిఖరం కృష్ణశాస్త్రి

యానాం: తెలుగు కాల్పనిక కవిత్వానికి దేవులపల్లి కృష్ణశాస్త్రి చేసిన సేవలు చిరస్మరణీయమని కవిసంధ్య సంపాదకుడు, కళారత్న డాక్టర్ శిఖామణి అన్నారు. గురువారం కృష్ణశాస్త్రి పుట్టిన రోజు సందర్భంగా ఆయన స్వగ్రామం చంద్రంపాలెంలో జరిగిన కృష్ణశాస్త్రి 122వ జయంతి సభలో శిఖామణి గౌరవ అతిథిగా హాజరై ప్రసంగించారు. ఆధునిక తెలుగు పద్యానికి మార్దవాన్ని, ఆర్ద్రతను అద్దిన మహాకవి కృష్ణశాస్త్రి అన్నారు. బంగారాన్ని కమ్మచ్చుతీగలా తీర్చిదిద్దినట్లు కృష్ణశాస్త్రి తెలుగు భాషకు మెరుగులు దిద్దారన్నారు. అద్భుతమైన లలితగీతాలు, సినీ గీతాలు, కృష్ణపక్షం, ఊర్వశి వంటి కావ్యాల ద్వారా తెలుగు కవిత్వాన్ని సుసంపన్నం చేశారన్నారు. తెలుగు భాష సజీవంగా వున్నంత కాలం కృష్ణశాస్త్రి చిరంజీవేనన్నారు. వ్యక్తి స్వాతంత్రాన్ని కవిత్వంలో ప్రతిష్టించిన మహోన్నత వ్యక్తి కృష్ణశాస్త్రి అని శ్లాఘించారు.

# స్కిల్ డెవలప్ మెంట్ ఇన్స్టిట్యూట్‌కు అసోచం అవార్డు



విశాఖపట్నం: ఆరిలోవలో ఎనిమిది ప్రభుత్వ రంగ ఇంధన సంస్థల తరపున హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ వారి ఆధ్వర్యంలో నడపబడుతున్న స్కిల్ డెవలప్ మెంట్ ఇన్స్టిట్యూట్ కు 2017-18 సంవత్సరానికి గాను ఉత్తమ అంకుర సంస్థ అవార్డును గురువారం నాడు న్యూఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో కేంద్ర నైపుణ్యాభివృద్ధి సహాయ మంత్రి అనంత కుమార్ హెగ్డే చేతులమీదుగా బంగారు పతకాన్ని అందుకున్నట్లు సంస్థ కార్యదర్శి కే.నగేష్ ఒక ప్రకటనలో తెలియజేశారు. నెలకొల్పిన ఏడాది కాలంలోనే 2000 మంది నిరుద్యోగ యువతకు ఉచిత ఉపాధి శిక్షణ ఇచ్చి నైపుణ్య రంగంలో నూతన ఒరవడులను నెలకొల్పినందుకు ఈ బహుమతి ప్రదానం చేసినట్టు అన్నారు. ఉత్తమ ప్రమాణాలతో దేశంలోనే ప్రధమ స్థానంలో నిలిచేలా నిరంతర కృషి చేసున్న సిబ్బందిని, విద్యార్థులను ప్రిన్సిపాల్ సీ.వీ.నరసింహ దాసు అభినందించారు.

# 5న పవన్ కల్యాణ్ రాక

పెద్దాపురం: జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ఈ నెల 5న పెద్దాపురం పట్టణానికి రానున్నట్లు పెద్దాపురం నియోజకవర్గం జనసేన ఇన్‌ఛార్జి తుమ్మల రామస్వామి బాబు తెలిపారు. స్థానిక బ్రాహ్మణ కల్యాణ మండపంలో నియోజకవర్గ జనసేన కార్యకర్తల ఆత్మీయ సమావేశం సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో అత్తిలి సీతారామ స్వామి, ఉమామహేశ్వరరావు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# రత్నగిరిపై కార్తీకమాస ఏర్పాట్లపై సమీక్ష సమావేశం



అన్నవరం: తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం రత్నగిరిపై కార్తీకమాసము ఏర్పాట్లుపై ఈవో ఎమ్.జితేంద్ర అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు.ముఖ్యంగా నేటి నుండి మొదలయ్యే సత్య దీక్ష మరియు 8వ తేదీ నుండి ప్రారంభమయ్యే కార్తీకమాసము దృష్ట్యా భక్తులకు ఎటువంటి ఇబ్బంది తలెత్తకుండా తగిన ఏర్పాట్లుపై మరియు అదేవిధంగా కార్తీక పౌర్ణమి రోజు జరిగే స్వామివారి గిరి ప్రదక్షిణము రోజున భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగ కుండా తగిన ఏర్పాట్లు మరియు 20వ తేదీ మంగళవారం క్షీరాబ్ది ద్వాదశి రాత్రి 6 గం.ల నుండి పంపాసరోవరంలో శ్రీ స్వామివారి తెప్పోత్సవం మరియు 23 వ తేదీ కొండదిగువన తొలిపావాంచ వద్ద జ్వాలాతోరణం మరియు సాయంత్రం 6గం.లకు పంపా సరోవరంలో పంపా హరతులకు తగిన ఏర్పాట్లుపై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఏసి ఈరంకి.జగన్నాధరావు,పిఆర్వో తులా.రాముడు దేవస్థానం అధికారులు, ప్రధాన అర్చకులు మరియు సిఐ అద్దంకి.శ్రీనివాస్, ఎస్సై పార్ధసారథి,తాహసీల్దార్ సుజాత,ఆరై భాస్కర ప్రసాద్ తదితరు పాల్గొన్నారు.

# ఎక్సైజ్ దాడులలో ముగ్గురు అరెస్టు

పెద్దాపురం: స్థానిక ఎక్సైజ్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగిన దాడులలో సారా విక్రయానికి పాల్పడుతున్న ముగ్గుర్ని అరెస్టు చేసినట్లు సిఐ నాగభూషణ రావు చెప్పారు. ఆనూరుకు చెందిన గుబ్బల వీర్రాజు, పైడిమళ్ల డానియేలు, జి. తిమ్మాపురానికి చెందిన కోసుబోయిన శీనులను అదుపులోనికి తీసుకున్నట్లు తెలిపారు. ఈ దాడుల్లో 55 లీటర్ల సారా, రెండు మోటారు సైకిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐ కృష్ణప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

# యుటిఎఫ్ నూతన కమిటీ ఎంపిక



రావులపాలెం: ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రావులపాలెం మండల కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. గురువారం స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశానికి ముఖ్య అతిధులుగా యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి సరాగుల జ్యోతిబసు హాజరయ్యారు. ఈ సందర్భముగా జ్యోతిబసు ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేసారు. అధ్యక్షునిగా కె. శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా కె. అర్జునరావు, గౌరవ అధ్యక్షునిగా బి. శ్రీనివాసరావు, అసోసియేట్ అధ్యక్షునిగా జిఎస్ఆర్ ప్రసాద్, పి. నిర్మల కుమారి, కోశాధికారిగా వివి దుర్గా ప్రసాద్‌లతోపాటు 9 మంది కార్యర్శులు, 9 మంది జిల్లా కౌన్సిలర్లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని ప్రధాన కార్యదర్శి అర్జునరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు, సభ్యులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# అవినీతి నిర్మూలనపై అవగాహనసదస్సు




పరవాడ:అవినీతి రహిత సమాజ స్థాపనకు విద్యార్థులు కృషి ఎంతైన అవసరమని పరవాడ జిల్లాపరిషత్ ఉన్నత బాలుర పాఠశాల ప్రదానోపాద్యాయులు సురేఖ అన్నారు. గురువారము అపన ఇండేన్ గ్యాస్ ఎజెన్సీ వారి అద్వర్యంలో జాతీయ నిఘా వారోత్సావాల్లో బాగంగా విద్యార్ధులుకు వ్యాసరచన ,చిత్రలేఖనం, క్విజ్ పోటీలును ఏర్పాటుచేసారు. ఈ సందర్భంగాఅమె మాట్లడుతూ దేశంలో అవినీతి పెచ్చుమీరుతుందన్నారు. దీని కారణంగా దేశ అర్దిక సంక్షోభం చిన్నా,బిన్నా అవుతుందన్నారు.లంచం ఇవ్వడం తీసికోవడము నేరము అని విద్యార్ధులు తల్లిదండ్రులుకు తెలియజేయాలని అన్నారు.పాఠశాల కమిటి చైర్మన్ పైల హరేష్ మాట్లడుతూ లంచం భూతం అనేక కుటుంబాలును నడిరోడ్డుపై పడేసిందన్నారు. ప్రభుత్వ అదికార్లుతో పని చేయించుకోవడము ప్రజలు కర్తవ్యమని అన్నారు.లంచం ఇచ్చి పనిచేయించుకోవడము నేరమని అన్నారు. అపన ఇండేన్ ఏజన్సీ అదినేత గుడివాడ అప్పల రామ్మూర్తి మాట్లడుతూ అవినీతి భారత దేశ సాకారము విద్యార్దుల చేతుల్లో వుందని అన్నారు.ఈకార్యక్రమంలో అపన ఇండేన్ గ్యాస్ మేనజర్ అకిరి.నర్సింగ్ రావు, బొండా శ్రీనువాసురావు, రాము, అప్పలరాజు , లక్ష్మి తథితర్లు పొల్గన్నారు.

# ఘనంగా దేవులపల్లి.కృష్ణ శాస్త్రి జయంతి వేడుకలు



అన్నవరం: తూ.గో.జిల్లా అన్నవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో కీ.శే.దేవులపల్లి.కృష్ణ శాస్త్రి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో తెలుగు పండిట్ శారద మాట్లాడుతూ తూ.గో.జిల్లా పిఠాపురం దగ్గర పల్లెటూరిలో పుట్టిన దేవులపల్లి.కృష్ణ శాస్త్రి గారి కవితాశైలి ప్రత్యేకమైనదని తాను ఏది చెప్పదలచుకున్నా నిర్భయంగా చెప్పేవారని అన్నారు.ఆయన రచనల్లో జయజయ ప్రియ భారత జనయిత్రి పాట ప్రతీ ఒక్కరి చెవుల్లో మారుమ్రోగు తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో హెడ్ మాస్టారు సూర్యనారాయణ గారు మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు చేయడము వలన పిల్లల్లో రచనల పట్ల అశక్తి పెంచుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాద్యాయులు సీతామహాలక్ష్మీ,ప్రకాష్, రమేష్, పిఇటి పవిత్ర తదితరులు పాల్గొన్నారు.

# పాదగయ ఈఓగా చలపతిరావు

పిఠాపురం : పట్టణంలో వున్న పాదగయ క్షేత్రానికి ఆలయ కార్యానిర్వాహణాధికారిగా పి.వి.చలపతిరావును దేవదాయశాఖ కమీషనర్ ఉత్తర్వుల మేరకు గురువారం అదనపు ఇంఛార్జ్ స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఆయన ద్రాక్షారామంలోని భృమేశ్వరస్వామి ఆలయానికి కార్యనిర్వాహణాధికారిగా విధులు నిర్వహిస్తున్న ఆయనకు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇప్పటివరకు కార్యానిర్వాహణాధికారి వున్న ఆర్.పుష్పనాధంను శ్రీకాకుళం బదిలీచేశారు.

# డాక్‌యార్డు ఉద్యోగులకు సంపూర్ణ సహకారం

- సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి
- ఎమ్మెల్యే పంచకర్లను సన్మానించిన అసోసియేషన్ నేతలు



విశాఖపట్నం : నేవల్ డాక్‌యార్డ్ కెటిబి అసోసియేషన్ ఉద్యోగులకు తనవంతు సంపూర్ణ సహకారం అందిస్తానని టీడీపీ రూరల్ అధ్యక్షులు, యలమంచిలి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు అన్నారు. గురువారం ఉదయం డాక్‌యార్డ్ కెటిబి అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు గంట్ల శ్రీనుబాబు ఆధ్వర్యంలో యూనియన్ నేతలంతా ఎమ్మెల్యే పంచకర్లను కలసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పంచకర్ల మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్న సమస్యలను పరిష్కరించే ందుకు తనవంతు కృషిచేస్తానన్నారు. కేంద్రం ఆధీనంలో ఉన్న మెడికల్ రీయంబర్స్‌మెంటు విషయమై కూడ దృష్టిసారిస్తామన్నారు. దీనితోపాటు అసోసియేషన్ చేపట్టిన ఉద్యోగుల భవన నిర్మాణానికి తనవంతు సహకారం అందిస్తానన్నారు. ఉద్యోగులంతా ఐక్యంగా కొనసాగితేనే సమస్యలు పరిష్కరించుకోవడానికి అవకాశం కలుగుతుందన్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు బి. చిరంజీవి ఉద్యోగుల కోసం కాకానినగర్‌లో నిర్మిస్తున్న నూతన భవన నిర్మాణ పనుల వివరాలను పంచకర్లకు వివరించారు. అందరి సహకారంతో ఈ భవనాన్ని వీలైనంత త్వరలో పూర్తిచేసి ఉద్యోగులకు అంకితమిస్తామని సంఘం గౌరవ అధ్యక్షులు గంట్ల శ్రీనుబాబు ప్రకటించారు. భవన నిర్మాణానికి సహకరిస్తున్నవారందరికీ శ్రీనుబాబు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నేతలు అసోసియేషన్ కార్యదర్శి భాస్కరరావు, ఇతర ప్రతినిధులు సన్యాసిరావు, వెంకటేష్, ప్రసాద్ తదితరులంతా పాల్గొన్నారు.

# అయ్యప్ప మాలాధారుల శాంతిర్యాలీ

రావులపాలెం: కలియుగ ప్రత్యక్షదైవం అయ్యప్పస్వామి ఆలయ ప్రతిష్టను కాపాడుకోవాలల్సిన బాధ్యత మనందరిపై ఉందని ప్రముఖ లాయరు పడాల వెంకటరెడ్డి స్వామి అన్నారు. గురువారం ఊబలంక రోడ్‌లో నూతనంగా నిర్మించిన వినాయక ఆలయం వద్ద లాయరు వెంకటరెడ్డి స్వామి ఆధ్వర్యంలో అయ్యప్ప మాలధారులు సుప్రింకోర్టు ఇచ్చిన తీర్పుకు నిరసనగా శాంతి ర్యాలీని నిర్వహించారు. ముందుగా వినాయ ఆలయం వద్ద సుమారు 300 మంది అయ్యప్ప మాలధారులతో ప్రారంభమైన శాంతి ర్యాలీ మార్కెట్, రింగ్‌రోడ్ మీదుగా కెవిఆర్ జంక్షన్‌కు చేరుకొని అక్కడినుండి జాతీయ రహదారి మీదుగా రావులపాడు జయశ్రీ ఆసుపత్రి వరకు అయ్యప్ప నామస్మరణతో మార్మోగింది. అనంతరం శెరణు ఘోషతో "శబరిమల పవిత్రతను కాపాడండి" "హిందూ ఆచార సాంప్రదాయలను రక్షించండి" అన్న నినాదాలతో స్థానిక తహశీల్దారు కార్యాలయం వద్ద కు చేరుకున్న శాంతి ర్యాలీ తహశీల్దారు జి. వేంకటేశ్వరరాజు, ఎస్సై సిహెచ్ విద్యాసాగర్‌లకు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భముగా పలువురు మాట్లాడుతూ ఇటీవల సుప్రింకోర్టు కేరళ రాష్ట్రంలో శబరిమల అయ్యప్ప స్వామిగా కొలువైన సన్నిధానానికి 10సం॥ల పైబడి 50 సం॥ల లోపు స్త్రీలకు ప్రవేశం కల్పించడాన్ని వ్యతిరేకిస్తున్నామని, వేలాది సంవత్సరాలుగా వస్తున్న ఆలయ సంప్రదాయానికి ఇప్పటి కేరళ ప్రభుత్వం పనిచేస్తుందని, ఆవిధంగా జరగడం వల్ల పూరాతన ఆచార, సాంప్రదాయములకు భంగం వాటిల్లడమేకాక, హిందువుల మనోభావాలకు తీవ్ర విఘాతం కలిగే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేసారు. అనేక వేల సంవత్సరాల పురాతన కాలం నుండి ఆలయంలో నిర్వహిస్తున్న ఆనవాయితీని కొనసాగించాలని ఆలయ ప్రతిష్ఠను దెబ్బతీయవద్దని స్వాములు వినతిపత్రంలో తెలిపారు. ఈ శాంతి ర్యాలీలో అయ్యప్ప సేవాసమితి సభ్యులు, గురుస్వామి తాడిగడప హరగోపాలకృష్ణమూర్తి, ఎనుముల సూర్యనారాయణ, నర్ల వెంకటసత్య చిట్టిబాబు, ఆకుల శివ, శ్రీఖాకోళపు సుబ్బారావు స్వాములు, శ్రీధర్మశాస్తానిలయం, రావులపాలెం స్వాములు, అయ్యప్ప భక్త సమాజం, ఊబలంక స్వాములు పాల్గొన్నారు.

# ఘణంగా ఆంధ్రరాష్ట్ర అవతరనదినోత్సవం




అమలాపురం; అమరజీవి పొట్టి శ్రీరామలు సాధించిన ఆంధ్రరాష్ట్ర అవతరనధినోత్సవం సందర్భంగా తూ..గో..జిల్లా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో స్థానిక పచ్చిగోళ్ళ జనార్ధనరావు కళ్యాణమండపంలోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి మున్సిపల్ చైర్మన్ చిక్కాల వినాయకరావు(గణేష్) ముఖ్యఅతిధిగా హాజరై పూలమాలలు వేసి ఘణంగా నివాళులు అర్పించారు.ఈసందర్భంగా చైర్మన్ గణేష్,జిల్లా ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షుడు వరదా సూరిబాబులు మాట్లాడుతూ ఆనాడు తమిళనాట ఉన్న ఉమ్మడి రాష్ట్రన్ని తెలుగు మాట్లాడేవారందరికి ప్రత్యాక రాష్ట్రం కావలని ఆమరణ నిరహారదీక్ష చేసి ప్రాణత్యాగం చేసి తెలుగు రాష్ట్రన్ని సాధించిన మహోన్నత వ్యక్తి పొట్టి శ్రీరాములు అని ఎన్నితరాలు మారిన అటువంటి త్యాగమూర్తులత్యాగాలు మరవ లేవని కొనియాడారు.పొట్టి శ్రీరాములు తెలుగు రాష్ట్ర అవతరనగావించిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు.

ఈకార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య సంఘ కార్యవర్గసభ్యులు నంబూరి సత్యనారాయణమూర్తి,సుగ్గు ప్రసాధ్,తటవర్తి రత్నాజీ,పాబోలు రాజా,లక్కింశెట్టి మూర్తి, యర్రమిల్లి విస్సు,పచ్చిగోళ్ళ సోమరాజు, శింగంశెట్టి కుమార్,మోటమూర్రి కుమార్, కె.వి.మావుళ్ళయ్య, శ్రీవాసవిసంఘం కార్యవర్గ సభ్యులు వంకాయల కాశీ,గుడివాడ రాంబాబు,నూలు కృష్ణ,కాళ్ళకూరి బుజ్జి,నంది పాటి శ్రీను తదితరులు పాల్గోన్నారు.

# నగర భాజాపా ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములకు ఘననివాళి

కాకినాడ: భారతీయ జనతా పార్టీ నగర అధ్యక్షులు చట్నీడి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈరోజు ఆంధ్ర రాష్ట్ర ప్రధాత స్వర్గీయ పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు యెనిమిరెడ్డి మాలకొండయ్య మాట్లాడుతూ నవంబర్ 1 వ తేదీన ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని నిరసిస్తూ వస్తున్నాము. కానీ ప్రస్తుత ప్రభుత్వం రాష్ట్రం విడిపోయిన తర్వాత నవ నిర్మాణ దీక్షల పేరుతో రాష్ట్రం కోసం 56 రోజులు ఆమరణ నిరాహార దీక్ష చేసి రాష్ట్రాన్ని సాధించి న స్వర్గీయ పొట్టి శ్రీరాములు విస్మరించిందని. రాష్ట్ర ప్రజలు అందరూ పొట్టి శ్రీరాములు చేసిన త్యాగము తెలుసుకోవాలని ఆయన అన్నారు. ఈ



కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు యెనిమిరెడ్డి మాలకొండయ్య తో పాటు నగర అధ్యక్షులు చట్నీడి శ్రీనివాస్, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎన్‌వి. సాయిబాబా, పైడా భవానీ ప్రసాద్, కెంగం హరి రామ ప్రసాద్, సత్తి గోపాలక ృష్ణ, బండారు భాస్కర్, గంగరాజు, లక్ష్మి తులసి తదితరులు పాల్గొన్నారు.

# చిత్రభాను

## ధైర్యంగా ముందుకురండి!







మీటూ ఉద్యమానికి భాషాభేదాలకు అతీతంగా మద్దతు లభిస్తున్నది. దక్షిణాది అగ్రనాయకానాయికలు బాధితులకు అండగా ఉంటామని భరోసానిస్తున్నారు. సమంత, రకుల్‌ప్రీత్‌సింగ్, విశాల్ మీటూకు బాసటగా ఉంటామని తెలిపారు. వేధింపులపై ఫిల్మ్‌ఛాంబర్‌లో ధైర్యంగా ఫిర్యాదు చేయాలని సమంత పిలుపునిచ్చింది

భయపడాల్సిన అవసరం లేదు - సమంత

మీటూ ఉద్యమానికి ప్రముఖ కథానాయిక సమంత పూర్తి మద్దతు ప్రకటించింది. లైంగిక వేధింపులకు గురైన వారు ధైర్యంగా ముందుకురావాలని పిలుపునిచ్చింది. ఫిర్యాదు చేసిన వారి పేరు గోప్యంగా ఉంటుంది కాబట్టి బయపడాల్సిన అవసరం లేదని చెప్పింది. వేధింపులకు వ్యతిరేకంగా గళం విప్పండి. ఫిల్మ్ ఛాంబర్ హైదరాబాద్ కార్యాలయానికి ఫిర్యాదుల్ని పంపించండి అని సమంత పేర్కొంది. తొలి నుంచి మీటూ ఉద్యమానికి అనుకూలంగా సమంత సోషల్‌మీడియాలో తన అభిప్రాయాల్ని వ్యక్తం చేస్తున్నది.

- రకుల్‌ప్రీత్‌సింగ్చిత్ర పరిశ్రమలో వేధింపులకు గురైన మహిళలు ధైర్యంగా ముందుకురావడం శుభపరిణామమని చెప్పింది రకుల్‌ప్రీత్‌సింగ్. మీటూ ఉద్యమం సత్ఫలితాలనిస్తుందని ఆశాభావం వ్యక్తం చేసింది. మీటూ విస్తృతంగా ప్రచారం పొందడం ఆనందంగా ఉంది. దీనివల్ల మంచి మార్పువస్తుందని ఆశిస్తున్నాను. పనిచేసే ప్రదేశాలు మహిళలకు సురక్షితంగా ఉండాలి. అయితే మీటూని దుర్వినియోగం చేయకుండా నిజాయితీగా న్యాయం కోసం పోరాడాలి అని చెప్పింది. ప్రస్తుతం రకుల్‌ప్రీత్‌సింగ్ బాలీవుడ్‌లో లవ్‌రంజన్ దర్శకత్వంలో దేదే ప్యార్‌దే అనే చిత్రంలో నటిస్తున్నది. ఇటీవలే దర్శకుడు లవ్‌రంజన్‌పై ఓ మహిళ లైంగిక ఆరోపణలు చేశారు. ఈ విషయమై రకుల్‌ప్రీత్‌సింగ్ స్పందిస్తూ దర్శకుడు లవ్‌రంజన్ అందరితో బాగుండేవాడు. ఆయనపై ఆరోపణలు రావడం ఒక్కసారిగా షాక్‌కి గురిచేసింది అని పేర్కొంది.

బాధితులకు అండగా ఉంటాం- విశాల్

మీటూ ఉద్యమంలో మహిళలకు బాసటగా నిలుస్తామని తమిళ హీరో విశాల్ ప్రకటించారు. అవసరమైతే వారికి భద్రత కల్పించడానికి ఓ కమిటీని ఏర్పాటు చేస్తామని చెప్పారు. పరిశ్రమలోని మహిళలు ధైర్యంగా ముందుకొచ్చి మాట్లాడండి. వారికి అండగా మేముంటాం. భద్రత కోసం ఓ కమిటీని నియమిస్తాం. వేధింపులను బయటపెట్టిన మహిళలను మేమెంతగానో గౌరవిస్తున్నాం. అమలాపాల్‌కు ఓ సందర్భంలో వేధింపులు ఎదురైతే ఆమె మాకు సమాచారం అందించారు. మేం వెంటనే రంగంలోకి దిగి సహాయం చేశాం అంటూ విశాల్ ట్వీట్ చేశారు.

విక్కీకౌశల్ తండ్రిపై ఆరోపణలు..

మీటూ సెగ బాలీవుడ్ నటుడు విక్కీకౌశల్ కుటుంబానికి తాకింది. మసాన్, రాజీ, సంజు సినిమాల్లో తన నటనతో ఆకట్టుకున్నారు విక్కీకౌశల్. ఆయన తండ్రి శామ్ కౌశల్ ఫైట్‌మాస్టర్‌గా పలు బాలీవుడ్ సినిమాలకు పనిచేశారు. ఓ సినిమా చిత్రీకరణలో శామ్‌కౌశల్ తనతో అసభ్యంగా ప్రవర్తించినట్లు నమితా ప్రకాష్ అనే అసిస్టెంట్ డైరెక్టర్ ఆరోపించారు. అవుట్‌డోర్ షుటింగ్‌లో ఉండగా వొడ్కా తాగడానికి శామ్ తనను రూమ్‌కు ఆహ్వానించారు. ఆయన ఆహ్వానాన్ని నేను తిరస్కరించాను. ఆ తర్వాత తన ఫోన్‌లో ఓ పోర్న్ వీడియోను నాకు చూపించారు అని తెలిపింది. నమితా ప్రకాష్ ఆరోపణలపై శామ్ కౌశల్ క్షమాపణలు చెప్పారు.

## నవంబర్‌లో వివాహం!



పాప్‌గాయకుడు నిక్‌జోనస్, బాలీవుడ్ భామ ప్రియాంకచోప్రా జంట ఇటీవలే నిశ్చితార్థం జరుపుకున్న విషయం తెలిసిందే. త్వరలో వీరిద్దరు వివాహబంధంతో ఒక్కటికాబోతున్నారు. పెళ్లివేడుకను వైభవంగా నిర్వహించడానికి ప్రియాంకచోప్రా సన్నాహాలు చేస్తున్నట్లు తెలిసింది. రాజస్థాన్‌లోని జోధ్‌పూర్‌ను పెళ్లి వేదికగా నిర్ణయించారు. నవంబర్ మాసంలో అక్కడి చారిత్రక ఉమేద్‌భవన్‌లో వివాహం జరగనుంది. ఇటీవలే ప్రియాంకచోప్రా, నిక్‌జోనస్ జోధ్‌పూర్‌ను సందర్శించి వివాహ ఏర్పాట్ల గురించి చర్చించారు. పెళ్లికి ఇరు కుటుంబానికి సంబంధించిన రెండొందల మంది అతిథుల్ని మాత్రమే ఆహ్వానిస్తారని సమాచారం. వివాహానంతరం హాలీవుడ్ సెలబ్రిటీస్ కోసం న్యూయార్క్‌లో గ్రాండ్ రిసెప్షన్‌కు సన్నాహాలు చేస్తున్నారు.

బాలీవుడ్ ప్రముఖుల కోసం ముంబయిలో విందు ఏర్పాటు చేస్తారని సమాచారం. హాలీవుడ్‌లో అరంగేట్రం చేసిన అనంతరం ప్రియాంకచోప్రా గ్లోబల్‌స్టార్‌గా గుర్తింపును సంపాదించుకుంది. దాంతో ఈ సుందరి పెళ్లి వేడుక కోసం విదేశీ మీడియా సైతం ఆసక్తిగా ఎదురుచూస్తున్నది. ఈ నేపథ్యంలో చారిత్రక నగరం జోధ్‌పూర్‌లో పెళ్లి వేదికను ఎంచుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది. నవంబర్ ద్వితీయార్థంలో పెళ్లికి తేదిని నిర్ణయించారని తెలుస్తున్నది.

## రెండు హిట్లు పడని.. అప్పుడు చేస్తా..



శైలజారెడ్డి అల్లుడు సినిమా సక్సెస్ తర్వాత అక్కినేని వారసుడు నాగచైతన్య జోష్ పెరిగింది. ఈ సినిమా తర్వాత తాజాగా వస్తున్న సినిమా సవ్యసాచి. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై రూపొందిన ఈ సినిమాలో నిధి అగర్వాల్ హీరోయిన్‌గా నటించింది. సీనియర్ నటుడు మాధవన్ ఈ చిత్రంలో విలన్‌గా కనిపిస్తున్నాడు. భూమిక కూడా ప్రత్యేకమైన పాత్రలో నటించింది. ఇలాంటి ప్రత్యేకతలు ఉన్న సవ్యసాచి సినిమా నవంబర్ 2 తెర ముందుకు వస్తున్నది. ఈ నేపథ్యంలో నాగచైతన్య తెలుగు ఫిల్మీబీట్‌తో ముచ్చటించారు. ఆయన ఏమి చెప్పారంటే..

ప్రేమమ్ సినిమా షుట్ నార్వేలో జరిగినప్పుడు సవ్యసాచి సినిమా కథ చెప్పారు. పాయింట్ కొత్తగా ఉండటంతో నచ్చింది కానీ.. పూర్తి సినిమాగా రావాలంటే చాలా విషయాలు జోప్పించాల్సి వచ్చింది. ప్రేమమ్ సినిమా రిలీజ్ తర్వాత పూర్తి కథ చెప్పాడు. కమర్షియల్ ఎలిమెంట్స్ సినిమాను ఆసక్తికరంగా స్క్రిప్టు పూర్తి చేశాడు. శైలజారెడ్డి అల్లుడు కలెక్షన్లు శైలజారెడ్డి అల్లుడు చిత్రం కారణంగా సవ్యసాచి రిలీజ్ వాయిదాపడటం నాకు కొంత బాధ కలిగింది. మరికొంత ఆనందం కలిగింది. ఎందుకంటే.. శైలజారెడ్డి చిత్రం నా కెరీర్‌లోనే ముందెన్నడూ లేని విధంగా కలెక్షన్లు తెచ్చిపెట్టడం ఆనందం కలిగింది. సవ్యసాచి సినిమా ప్రేక్షకులకు కాస్తా ఆలస్యం చేరడం కొంత బాధ కలిగింది. బాడీ లాగ్వేంజ్‌కి తగినట్టుగా శైలజారెడ్డి తర్వాత డ్యాన్సులు బాగున్నాయనే మాట వినిపించడం ఆనందంగా ఉంది. నేను సరిగా డ్యాన్స్ చేయలేను. కానీ డ్యాన్స్ మాస్టర్ శేఖర్ మాస్టర్ నా బాడీ లాంగ్వేజ్ పట్టుకొని మంచిగా రిథమిక్‌గా డ్యాన్స్‌లు కంపోజ్ చేశారు. నా డ్యాన్సులు బాగున్నాయంటే అందుకు శేఖర్ మాస్టర్‌కు థ్యాంక్స్ చెప్పాలి. పౌరాణిక చిత్రాల్లో నటించాలని మా తాతగారు మాయాబజార్ అర్జునుడు గతంలో పాత్ర వేశారు. భవిష్యత్‌లో పౌరాణిక చిత్రాల్లో నటించాలని ఉంది. కానీ రెండు, మూడు హిట్లు పడిన తర్వాత పౌరాణిక చిత్రాలు చేసే ఆలోచన చేస్తాను. నాకు విభిన్నమైన చిత్రాల్లో కనిపించాలన్నదే నా కోరిక. అందుకే సవ్యసాచికి రిపేర్లు చేశాం సవ్యసాచి సినిమా చూసిన తర్వాత నాన్న (నాగార్జున) కొన్ని సలహాలు ఇచ్చారు.

## పాత్రలో ప్రాముఖ్యత...?



స్టార్ హీరోయిన్ సమంత... వివాహం తర్వాత ఎంచుకునే సినిమాలు, కథల విషయంలో చాలా మార్పు కనిపిస్తోంది. హీరో పక్కన పెద్దగా ప్రాధాన్యం లేని పాత్రలు చేయడం కంటే తన పాత్రకు ఎక్కువ ఇంపార్టెన్స్ ఉంటేనే పాత్రలు చేయడానికే ఎక్కువ మక్కువ చూపిస్తున్నారు. దీంతో పాటు 'యూ టర్న్' లాంటి ప్రయోగాత్మక సినిమాలూ చేస్తున్నారు.

తాజాగా సమంత మరో ప్రయోగాత్మక సినిమాలో నటించడానికి సిద్ధమవుతున్నట్లు సమాచారం. పౌరాణిక పాత్రలో నటించడానికి ఓకే చెప్పిందని, ఇది నెగెటివ్ పాత్ర అయినప్పటికీ పెర్ఫార్మెన్స్ ఓరియెంటెడ్ కావడంతో ఒప్పుకుందని తెలుస్తోంది.

యానిమేషన్ చిత్రాలతో అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న భార్గవ్ అనే ఫిల్మ్ మేకర్ రామాయణం ఆధారంగా తెరకెక్కించే పౌరాణిక సినిమాలో సమంత శూర్పణఖ పాత్రలో కనిపించబోతున్నట్లు టాక్. నెగెటివ్ రోల్ సమంత ఒప్పుకోవడానికి కారణం? ఈ సినిమా శూర్పణఖ కోణంలో సాగుతుందని తెలుస్తోంది. ఇది నెగెటివ్ పాత్ర అయినప్పటికీ పెర్ఫార్మెన్స్ ఓరియెంటెడ్ రోల్ కావడం, తానే కీలక పాత్రధారి కావడంతో సమంత ఈ సినిమా చేయడానికి ఒప్పుకున్నారట. గతంలో కాజల్ పేరు గతంలో ఈ పాత్ర హీరోయిన్ కాజల్ చేయబోతోందనే వార్తలు వినిపించాయి. ఇప్పుడేమో సమంత పేరు తెరపైకి వచ్చింది. అయితే చిత్ర బృందం నుంచి అఫీషియల్ సమాచారం రావాల్సి ఉంది. సమంత సినిమాలు ప్రస్తుతం సమంత తమిళంలో సూపర్ డిలక్స్ అనే చిత్రంతో పాటు.... తెలుగులో నాగ చైతన్యతో కలిసి ఓ సినిమా చేస్తున్నారు. కాగా.. ఇటీవల విడుదలైన సమంత చిత్రం యూ టర్న్ బాక్సాఫీసు వద్ద యావరేజ్‌గా ఫలితాలు సాధించిన సంగతి తెలిసిందే.

# క్రమశిక్షణకు, నిబద్ధతకు మారుపేరు వరుణ్ గ్రూప్

- అక్టోబర్‌లో వరుణ్ బజాజ్ రికార్డుస్థాయిలో అమ్మకాలు
- ఒక్కనెలలోనే 4315 వాహనాల అమ్మకం
- మరోసారి ఆలిండియా నం.1 డీలర్‌గా వరుణ్ బజాజ్
- బజాజ్ కస్టమర్లనుండి విశేష స్పందన
- వరుణ్ గ్రూప్ ఛైర్మన్ ప్రభుకిషోర్



విశాఖపట్నం: భారతదేశపు నం.1 బజాజ్ డీలర్ వరుణ్ బజాజ్ దసరా ఆఫర్లకు వినియోగదారుల నుండి అనూహ్య స్పందన లభించిందని వరుణ్ గ్రూప్ ఛైర్మన్ ప్రభు కిషోర్ పేర్కొన్నారు. గురువారం తమ సంస్థ కార్యాలయంలో సిబ్బందితో కలిసి ఆ ఆనందాన్ని పంచుకున్నారు. అనంతరం కేక్ కట్ చేసి పండగ సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ప్రభు కిషోర్ మాట్లాడుతూ కేవలం ఒక్క అక్టోబర్ నెలలోనే కనీవినీ ఎరుగని స్థాయిలో 4315 బైక్‌లను అమ్మకం చేసి ఆలిండియాలోనే నెం. 1 స్థానాన్ని దక్కించుకున్నదంటే వరుణ్ బజాజ్ సిబ్బంది కృషి ఎంత అమోఘమో మాటలతో చెప్పనలవి కాదన్నారు. ఇది క్రితం సంవత్సరంతో పోలిస్తే 23 శాతం ఎక్కువని అన్నారు. ఇంతటి రికార్డ్ సేల్స్‌ని అందించిన కస్టమర్లందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. వరుణ్ మోటార్స్ రెండు రాష్ట్రాల్లోనూ ప్రజలకు సుపరిచితమైన సంస్థ అని, అంతేకాక ద్విచక్ర, ఆటో రంగంలోని అన్ని విభాగాల్లో వరుణ్ బజాజ్ మొదటి స్థానంలో నిలిచిందని అన్నారు. వాహనదారులకు అత్యుత్తమ సేవలందించడం ద్వారానే ఈ ఘనత సాధించినట్లు ప్రభు కిషోర్ తన ఆనందాన్ని వ్యక్తం చేశారు.

వరుణ్ బజాజ్ సీఈవో శ్రీనివాస్ మాట్లాడుతూ క్రమశిక్షణకు, నిబద్దతకు మారుపేరైన వరుణ్ గ్రూప్‌లో వినియోగదారులకు నాణ్యమైన సేవలందించడమే తమ సంస్థ విజయానికి ప్రధాన కారణమని పేర్కొన్నారు. ఈ రికార్డు విజయాలకు తమ 26వ వార్షికోత్సవం మరియు దసరా సంబరాలకు ప్రకటించిన ఆఫర్లే ప్రధాన కారణమని కూడా తెలిపారు. వీటికి కస్టమర్ల నుండి విశేష స్పందన లభించిందని, వినియోగదారుల సేవలు, కార్యాలయ సిబ్బంది అకుంఠిత దీక్షలే సంస్థను ఆలిండియా నెం.1గా నిలబెట్టడానికి ప్రధాన కారణాలని తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో వరుణ్ గ్రూప్ డైరెక్టర్లు లక్ష్మీ కిషోర్, వర్ష మరియు వరుణ్ గ్రూప్ సిబ్బంది పాల్గొన్నారు.



తమ అధినేత, కుటుంబ సభ్యులు, తమ సిబ్బందితో తన జన్మదిన వేడుకలు ఘనంగా జరుపుకుంటున్న వరుణ్ బజాజ్ సీఈఓ అడారి శ్రీనివాస్

## లోకకల్యాణం కోసమే అతిరుద్రయాగం

### శారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి మహాస్వామి



పెందుర్తి: విశ్వశాంతికోసం, దేశంలోను, రాష్ట్రంలోను ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, రైతులు ఆనందంగా ఉండాలని, పశుసంపద వర్ధిల్లాలని లోకకల్యాణం కోరుతూ పెందుర్తిలోగల, శారదాపీఠంలో లక్షచండీ యాగం, అతిరుద్రయాగం అతత్యంత వైభవంగా నిర్వహించ నున్నట్టు షణ్మతస్థాపనా చార్య జగద్గురు శంకరాచార్య విశాఖ శ్రీ శారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి మహాస్వామి పేర్కొన్నారు. నేటి నుంచి ఈ యాగాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ యాగం శ్రీచరణుల దివ్యమంగళాశీస్సులతో బాలస్వామి ఆధ్వర్యంలో ఎంపీ. డాక్టర్ టి. సుబ్బరామిరెడ్డి వార్లచే గత 11 సంవత్సరాలుగా నిరంతరాయంగా నిర్వహించబడుతున్నట్లు పేర్కొన్నారు. నవంబర్ 6వ తేదీ వరకు ఈ యాగాన్ని చేస్తున్నట్లు తెలియజేశారు. ఈ యాగంలో వివిధ రాష్ట్రాల నుంచి సుమారు 300 మంది రుత్విక్కులు పాల్గొంటారని తెలిపారు. ఈ యాగంలో విశాఖ ప్రజలందరూ పాల్గొనవచ్చునని మహాస్వామి పేర్కొన్నారు. ఈ యాగంలో పాల్గొనడం పూర్వజన్మసుకృతమని, అమ్మవారి తీర్థప్రసాదములు విశేషంగా ఆశీస్సులు భక్తులందరూ పొందగలరని కోరుతున్నామని పీఠ ప్రాంగణ సిబ్బంది, ధర్మాధికారి తెలియజేశారు.

## రావాలి జగన్-కావాలి జగన్



విశాఖపట్నం: ఇంటింటికీ నవరత్నాలు హామీలు ప్రచార కార్యక్రమంలో భాగంగా బుధవారం 35వ వార్డు 44వ బూత్ సంజీవయ్య కోలని ఏరియాలో విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు పర్యటించారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు కట్టుమూరి సతీష్, మాజీ కార్పొరేటర్లు పామోటి బాబ్జీ, సేనాపతి అప్పారావు, తుళ్ళి చంద్ర శేఖర్, స్వర్ణ మణి, ఆళ్ళ శివ గణేష్, నాంబాల ఈశ్వరరావు, పైడి శ్రీను, రాయుడు శ్రీను, ఎమ్.వి.రాఘవులు, కె. చిన్నా, ఎస్.గోవింద్, జి.కృపా రావు, రాంబాబు, ఎస్.స్వామి, సురేష్, అనిత, సుజాత, జయ, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జగన్ హత్యాయత్నం కేసుని వెంటనే సిబిఐకి అప్పగించాలి

### యువజన అధ్యక్షుడు కొండా రాజీవ్ గాంధీ



విశాఖ సిటీ: వైయస్ జగన్మోహన్ రెడ్డిపై జరిగిన హత్యాయత్నం కేసును వెంటనే సిబిఐకి అప్పగించాలని ఆ పార్టీ యువజన విభాగం ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం ఎదుట కళ్ళకి నల్ల రిబ్బన్లు కట్టుకుని భారీ నిరసన ప్రదర్శన చేశారు. ఈ నిరసనలో భాగంగా టిడిపి ప్రభుత్వం మరియు దర్యాప్తు బృందం ఏ విధంగా ప్రజల కళ్ళకి గంతలు కడుతూ నిజాలు దాస్తూ కేసుని పక్కదోవ పట్టిస్తున్నారన్న విషయాన్ని వినూత్న రీతిలో ప్రదర్శించారు. అనంతరం కాంప్లెక్స్ కూడలి నందు మానవహారంగా ఏర్పడి నినాదాలతో నిరసన ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కొండా రాజీవ్ గాంధీ మాట్లాడుతూ జగన్ హత్యాయత్నం కేసులో రాష్ట్ర ప్రభుత్వం మీద గాని, రాష్ట్ర ప్రభుత్వం నియమించిన దర్యాప్తు బృందం మీద కాని ప్రజలకి నమ్మకం లేదని సిట్ పనితీరు ఏంటో గతంలో విశాఖపట్నంలో జరిగిన లక్ష కోట్ల భూ కుంభకోణంలో అందరూ చూశారని కాబట్టే సిబిఐ విచారణ వేసి తీరాలని పునరుద్ఘాటించారు. కేంద్రం ఆధీనంలో ఉండే విమానాశ్రయంలో హత్యాయత్నం జరిగింది కాబట్టి మా పరిధిలోకి రాదు అంటూ రాష్ట్ర ప్రభుత్వం పోలీస్ డిపార్ట్‌మెంట్ తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు కానీ వాస్తవానికి ఒక అంతర్జాతీయ మరియు డిఫెన్స్ ఎయిర్ పోర్ట్ అయినటువంటి విశాఖపట్నం ఎయిర్ పోర్ట్‌లోకి ఉద్యోగిని తీసుకునే ముందు వాళ్ళ లోకల్ పోలీస్ క్లియరెన్స్ సర్టిఫికెట్ అడుగుతారు రెండు కేసులు ఉన్నటువంటి దుండగుడికి ఏ విధంగా పోలీస్ క్లియరెన్స్ సర్టిఫికెట్ వచ్చిందో రాష్ట్ర ప్రభుత్వం మరియు పోలీస్ శాఖ సమాధానం చెప్పి తీరాలని ప్రశ్నించారు. ఘటన సమయంలో లేని 11 పేజీల లేఖలో నిజా నిజాలు తెలియాలంటే నిందితుడిని మీడియా ముందు ప్రవేశ పెట్టి రెండు పేజీలు చెప్పమంటే తేలిపోతుందని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి చిన్ని, రాష్ట్ర యువజన కార్యదర్శులు మాసిపోగు రాజు, నల్ల రవికుమార్, రాష్ట్ర యువజన అధికార ప్రతినిధి తుల్లి చంద్రశేఖర్ యాదవ్, నగర అధికార ప్రతినిధి నాగభూషణం, పార్లమెంట్ కార్యదర్శి బోడేటి ప్రసాద్, నగర యువజన ప్రధాన కార్యదర్శి చక్కర శేఖర్, నగర యువజన కార్యదర్శి పోరాపు భాస్కర, వార్డు యువజన అధ్యక్షులు రమేష్, పోలిరెడ్డి, చంటి, సి.హెచ్ రాజు, గోవింద్ రాజ్, కోరుకుండా సూర్య ప్రసాద్, దూడ అప్పారావు ,యాసిన్ బాబా, అరుణ్ కుమార్, సురేష్ కమల్, మద్ది పోలిరెడ్డి, దిలీప్ కుమార్, చిప్పల చందు, తిరుమల వినోద్, ముజీబ్ ఖాన్, ఉమా మహేష్, బొందల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## వాటర్ ట్యాంకర్‌ను ఢీకొట్టిన విమానం...

కోల్‌కతా: ఖతార్ ఎయిర్‌వేస్‌కి చెందిన ఓ విమానం తృటిలో పెను ప్రమాదం నుంచి తప్పించుకుంది. దోహా నుంచి వచ్చిన క్యూఆర్ 540 విమానం... వస్తూ వస్తూనే ఎయిర్‌పోర్టులోని ఓ వాటర్ ట్యాంకర్‌ను ఢీకొట్టింది. కోల్‌కతాలోని నేతాజీ సుభాష్ చంద్రబోస్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఈ సంఘటన చోటుచేసుకున్నట్టు అధికారులు వెల్లడించారు.

ప్రమాద సమయంలో విమానంలో 100 మందికి పైగా ప్రయాణికులు ఉన్నట్టు సమాచారం. ప్రమాదం ధాటికి విమానం మధ్య భాగం దెబ్బతిందనీ... ప్రయాణికులు, సిబ్బంది క్షేమంగా బయటపడ్డారని ఎయిర్ పోర్టు అధికారి ఒకరు వెల్లడించారు. విమానం ఎంతమేర దెబ్బ తిన్నదో గుర్తించేందుకు ఇంజినీర్లు ఎయిర్ కండిషన్ వ్యవస్థను పరీక్షిస్తున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే ప్రయాణికులను దించేసిన అధికారులు... కార్గో ఏరియాకి తీసుకెళ్లి మరమ్మతులు చేపట్టారు.

ప్రపంచ వ్యాప్తంగా ఇటీవల చోటు చేసుకుంటున్న వరుస విమాన ప్రమాదాలు ప్రయాణికులను తీవ్ర కలవరానికి గురిచేస్తున్నాయి. ఇటీవల ఇండోనేషియాలో 189 మందితో వెళ్తున్న లయన్ ఎయిర్ విమానం సముద్రంలో కూలిపోయిన సంగతి తెలిసిందే.

LOANS / లోన్స్
HAPPY HOMES
We arrange Business Loans
Mortgage Loans
Home Loans, Personal Loans
and Pvt. Loans... Etc.,
94902 33750

## ఓఎన్జీసీ, కాకినాడ వారి నిధులతో అచ్చంపేట జంక్షన్ సుందరీకరణ



కాకినాడ: అచ్చంపేట జంక్షన్ సుందరీకరణ మరియు పునరాభివృద్ధికి ఓఎన్జీసీ, కాకినాడచే రూ. 52 లక్షల చెక్కును ఓఎన్జీసీ ఈస్టర్న్ ఆఫ్షోర్ అసెట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ - అసెట్ మేనేజర్ అరవింద్ మొర్బాలే బుధవారం గోదావరి డెవలప్మెంట్ అథారిటీ వైస్ చైర్మన్ డాక్టర్ ఆర్. అమరేంద్ర కుమార్‌కు అందజేశారు. అచ్చంపేట జంక్షన్ కాకినాడ నగరానికి ఒక క్రాస్ రోడ్ జంక్షన్ మరియు గేట్ వే. విశాఖపట్నం మరియు రాజమండ్రిల నుండి వచ్చే ప్రధాన రహదారులు ఇక్కడ కలుస్తాయి. గోదావరి డెవలప్మెంట్ అథారిటీ, జిల్లా అధికారులతో కలిసి జాతీయ రహదారిని అధిగమించి, నగరాన్ని దాటుతుంది. పునర్వ్యవస్థీకరణ మరియు ఆధునీకరణ మరియు సుందరీకరణ అచ్చంపేట జంక్షన్ ప్రాజెక్టులో ప్రధాన భాగం. ఓఎన్జిసి, చమురు, గ్యాస్ ప్రధాన ప్రభుత్వరంగ సంస్థ, ఎల్లప్పుడూ రాష్ట్ర ప్రజలకు సహాయం అందించడానికి ముందంజలో ఉంది మరియు కాకినాడలో దాని ప్రధాన కార్యాలయం ఈస్టర్న్ ఆఫ్షోర్ అసెట్ మరియు హెచ్‌పిహెచ్‌టి ఆసెట్ యొక్క వ్యాపార ప్రధాన కార్యాలయాలతో ముఖ్యమైన ఉనికి కలిగి ఉంది. కాకినాడలో అనేక ఇతర నగర సంక్షేమ పథకాలను పార్కులను అందంగా తీర్చిదిద్దేందుకు కూడా ఓఎన్జీసీ ఆలోచిస్తోంది. ఒఎన్జిసి ఇటీవల రూ.40 లక్షలను రాజమండ్రి విమానాశ్రయం వద్ద ఉన్న రహదారి యొక్క అందాల కోసం అందజేసింది. తూర్పుగోదావరి జిల్లాలోని సీఎస్ఆర్‌తో చాలా మంది ప్రజల ఆధారిత పథకాలను ఇది నిర్వహిస్తోంది.





### విండీస్‌పై 9 వికెట్ల తేడాతో

## టీమిండియా ఘన విజయం



తిరువనంతపురం: చివరి వన్డేలోనూ వెస్టిండీస్‌కు ఘోర పరాభవం తప్పలేదు. ఆ జట్టు నిర్దేశించిన 105 పరుగుల లక్ష్యాన్ని భారత్ ఆడుతూ పాడుతూ 14.5 ఓవర్లకే ఛేదించింది. 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. 3-1 తేడాతో సిరీస్‌ను కైవసం చేసుకుంది. ఒక మ్యాచ్ టైగా ముగిసిన సంగతి తెలిసిందే. అంతకు ముందు భారత్ బౌలింగ్ దాడికి కరీబియన్ జట్టు 31.5 ఓవర్లకు 104 పరుగులకు కుప్పకూలింది. జడేజా మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపికయ్యాడు. స్వల్ప లక్ష్య ఛేదనలో భారత్ 6 పరుగుల వద్దే ఓపెనర్ శిఖర్ ధావన్ (6; 5 బంతుల్లో 1స4) వికెట్ చేజార్చుకుంది. సిరీస్‌లో అతడి పేవల ఫామ్‌ను చివరి వన్డేలోనూ కొనసాగించాడు. ఐదు ఇన్నింగ్సుల్లో కనీసం అర్ధశతకం లేకుండా అతడు సిరీస్‌ను ముగించడం ఇదే తొలిసారి. అతడి నిష్క్రమణతో క్రీజులోకి వచ్చిన విరాట్ కోహ్లీ (33; 29 బంతుల్లో 6స4) తన సొగసరి షాట్లతో అలరించాడు. మరోవైపు ఆచితూచి ఆడిన రోహిత్ శర్మ (63; 56 బంతుల్లో 5స4, 4స6) ఓ అద్భుత బంతికి కీపర్‌కు క్యాచ్ ఇచ్చాడు. పెవిలియన్ వైపు సాగాడు. అంపైర్ నోబాల్‌గా ప్రకటించడంతో ఊపిరిపీల్చుకున్న అతడు ఇక రెచ్చిపోయి ఆడాడు. కళ్లు చెదిరే సిక్సర్లు, భారీ బౌండరీలతో విరుచుకుపడ్డాడు. అర్ధశతకం బాదేశాడు. దీంతో లక్ష్య ఛేదన 14.5 ఓవర్లకే పూర్తైంది. హిట్‌మ్యాన్ ఈ మ్యాచ్‌లోనే 200వ సిక్సర్ బాదేశాడు. కేవలం 187 ఇన్నింగ్సుల్లోనే ఈ ఘనత సాధించాడు. వెస్టిండీస్‌పై ఒక సిరీస్‌లో అత్యధిక పరుగులు 360 చేసిన రెండో భారత ఆటగాడిగా నిలిచాడు. విరాట్ కోహ్లీ 444తో అగ్రస్థానంలో ఉన్నాడు.

తొలి ఇన్నింగ్స్‌లో వెస్టిండీస్ మళ్లీ విలవిల్లాడింది. టీమిండియా బౌలింగ్ దాడికి కుదేలైంది. 104 పరుగులకే కుప్పకూలింది. కేవలం ముగ్గురు ఆటగాళ్లే ఆ జట్టులో రెండంకెల స్కోరు చేశారంటేనే అర్థమవుతుంది భారత బౌలింగ్ పదును. రవీంద్ర జడేజా (4/34) మరోసారి తన ఇంద్రజాలం చూపించాడు. అతడికి తోడుగా బుమ్రా, ఖలీల్ అహ్మద్ తలో రెండు వికెట్లతో చెలరేగారు. భారత్‌పై కరీబియన్ జట్టుకు ఇదే అత్యల్ప స్కోరు కావడం గమనార్హం. గత మూడు వన్డేల్లో 6.17 స్ట్రైక్‌రేట్‌తో 926 పరుగులు చేసిన విండీస్ చివరి రెండు మ్యాచుల్లో 3.77 సగటుతో 257 పరుగులే చేయడం విశేషం.

VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 K Phone : 2564353, Fax : 0891-2569004 K e-mail: vijayabhanudaily@gmail.com